


https://www.sreechakranews.com

# శ్రీచక్ర

SREECHAKRA TELUGU DAILY




సంపుటి 11 | సంచిక 13 | కర్నూలు | బుధవారం ఫిబ్రవరి 18 2026 | పేజీలు : 08 | వెల రూ. 5.00

Published from Kurnool... Circulated by Andhra Pradesh, Telangana & New delhi

## ఏపీ అసెంబ్లీలో కొనసాగుతున్న ప్రశ్నోత్తరాలు



అమరావతి, ఫిబ్రవరి 17(శ్రీచక్ర) : ఏపీ అసెంబ్లీ సమావేశాలు నాలుగవ రోజు ప్రారంభమయ్యాయి. శాసనసభ మొదలైన వెంటనే డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు ప్రశ్నోత్తరాలను చేపట్టారు. ఆంధ్రా ఒడిస్సా సరిహద్దులో గంజాయి నియంత్రణపై పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ప్రశ్న లేవనెత్తారు. హోం మంత్రి వంగలపూ డి అనిత సమాధానమిస్తూ... ప్రస్తుతం రాష్ట్రంలో గంజాయి నియంత్రణలో ఉందని, కూటమి ప్రభుత్వం రాగానే గంజాయిపై ఉక్కిపాదం మోపినట్లు తెలిపారు. వైసీపీ హయాంలో రాష్ట్రం గంజాయి కేంద్రంగా మారిందని విమర్శించారు. గత ప్రభుత్వం లో నియం త్రణ లేకుండా పోయిందని హోంమంతి ఆరోపిం చారు.కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే గంజాయి రవాణా, సాగుపై కఠిన చర్యలు చేపట్టిందని వివరిం చారు. ఈగల్ విభాగాన్ని ఏర్పాటు చేసి గంజా యి రవాణాకు అడ్డుకట్ట వేసినట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 35 చెక్ పోస్టులను ఏర్పాటు చేసి గంజాయి రవాణాను అరికట్టా మని తెలిపారు. గంజాయి సాగు, రవాణాపై నిరంతర నిఘా పెట్టామన్నారు. 47 ప్రాంతాల్లో డ్రోన్‌ల ద్వారా నిఘా చేసి, అక్రమ సాగును గుర్తించి ధ్వంసం చేస్తున్నామని వివరించారు. గంజాయి తరలించే వారిపై 1,400కు పైగా కేసులు నమోదు చేశామని మంత్రి తెలిపారు. గంజాయి వల్ల కలిగే దుష్ఫలితాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. పొరుగు రాష్ట్రాల పోలీసు యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటున్నామని హోం మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు.గంట ఆలస్యంగా.. బడ్జెట్ రోజు సమస్య తలెత్తడంతో ఆ రోజు సరి చేశారు అధికారు లు. అయితే, మళ్ళీ అదే సమస్య తలెత్తడంతో అసెంబ్లీ సాంకేతిక సిబ్బంది సరి చేసే ప్రయత్నం చేశారు. గంట సమయం పడుతుం దని స్పీకర్ కార్యాలయానికి సిబ్బంది తెలియజేశారు. దీంతో సభను పాటు వాయిదా వేస్తున్నట్టు డిప్యూటీ స్పీకర్ ప్రకటించారు.

# మెక్రాన్‌తో ముంబైలో మోదీ భేటీ

ముంబై: (శ్రీచక్ర) భారత పర్యటనలో ఉన్న ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మెక్రాన్ తో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ముంబై లో భేటీ అయ్యారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా సోమవారం రాత్రి మెక్రాన్ ముంబైకి వచ్చారు. దీంతో ప్రధాని మోదీ మహారాష్ట్ర లోక్‌భవన్‌కు మంగళవారం మధ్యాహ్నం చేరుకుని మెక్రాన్‌కు సాదర స్వాగతం పలికారు. లోక్‌భవన్ వద్ద ప్రధానికి మహారాష్ట్ర, గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్ స్వాగతం పలికారు.ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్‌తో సమావేశమయ్యేందుకు ప్రధానమంత్రి మోదీ మహరాష్ట్ర భవన్‌కు చేరుకున్నారని, ఆయనకు సాదర స్వాగతం పలికామని ఆచార దేవ్‌వ్రత్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలిపారు. మెక్రాన్ తన పర్యటనలో భాగంగా ఫస్ట్ లేడీ బ్రిగిట్టె మెక్రాన్‌తో కలిసి మంగళవారం ఉదయం తేజ్ హోటల్ వద్ద 2008 ముంబై ఉగ్రదాడి మృతులకు నివాళులర్పించారు.మెక్రాన్ పర్యటనను స్వాగతిస్తూ ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా మంగళవారం ఉదయం పోస్ట్ పెట్టారు. మెక్రాన్‌కు స్వాగతమని, ఈ పర్యటనలో భారత్-ఫ్రాన్స్ సంబంధాలను మరో స్థాయికి తీసుకు వెళ్లేందుకు ఎదురుచూస్తున్నామని పేర్కొన్నారు. ఇరుదేశాల మధ్య చర్చలు వివిధ రంగాల్లో సహకారాన్ని బలోపేతం చేయడంతో పాటు ప్రపంచ పురోగతికి దోహదం చేస్తాయని విశ్వసిస్తున్నామని అన్నారు. ముంబై, ఢిల్లీలో



మెక్రాన్‌తో భేటీ అయ్యేందుకు ఎదురుచూస్తున్నట్టు మోదీ పేర్కొన్నారు.మెక్రాన్ భారత్ పర్యటనలో భాగంగా ఈనెల 19న ఢిల్లీలో జరిగే 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్'లో పాల్గొంటారు. మెక్రాన్-మోదీ మధ్య జరిగే ద్వైపాక్షిక చర్చల్లో భారత్‌కు 114 రఫేల్ యుద్ధ విమానాల సరాఫరాకు ఒప్పందం కుదిరే అవకాశం ఉంది. రూ.3.25 లక్షల కోట్ల విలువైన దేశ చరిత్రలోనే అతిపెద్ద రక్షణ ఒప్పందంగా నిలువనుంది

## ఎమ్మెల్యేలు సభకు రాకపోతే జీతాలు కట్..

### ప్రజలు రీకాల్ చేయాలి: స్పీకర్ అయ్యన్నపాత్రుడు



అమరావతి, ఫిబ్రవరి 17(శ్రీచక్ర) : ఏపీ అసెంబ్లీ సమావేశాలు గంట ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. దీనిపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్పందించారు. మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ.. ఉదయం సభ ఆలస్యంగా ప్రారంభమైందని, దీనికి కారణం సాఫ్ట్‌వేర్ సమస్య అని వెల్లడించారు. 'టెక్నికల్ ప్రాబ్లెమ్ వచ్చినప్పుడు ఎవరు ఏం చేయగలరు? వైసీపీ వాళ్లు ఏదైనా రాజకీయం చేస్తారు. ఇంతకు ముందు ఫేస్ టు ఫేస్ రాజకీయాలు ఉండేవి. ఇప్పుడు వెనకాల నుంచి గుంతలు తవ్వుతున్నారు' అని స్పీకర్ వ్యాఖ్యానించారు.అయితే కోరం పూర్తిగా ఉందని, చాలా మంది సభ్యులు సమయానికి హాజరయ్యారని స్పీకర్ అయ్యన్న తెలిపారు. డిజిటల్ అటెండెన్స్ వ్యవస్థ అద్భుతంగా పనిచేస్తోందన్నారు. సభ్యులు అసెంబ్లీకి రావడమే కాకుండా సభలో ఎన్ని గంటలు, నిమిషాలు కూర్చున్నారో కూడా నమోదవుతోందని చెప్పారు. శాసనసభకు రాని వైసీపీ ఎమ్మెల్యేలపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. 'విధులు సక్రమంగా నిర్వర్తించని ఎమ్మెల్యేలను ప్రజలు రీకాల్ చేయాలి. శాసనసభకు రావటం ఎమ్మెల్యేల విధి. కొందరు అసలు సభకే రాకుండా జీతభత్యాలు తీసుకోవటం తగదు. వారికి జీతం కట్ చేయాలి' అని స్పష్టం చేశారు. ఉద్యోగులు రాకపోతే జీతాలు కట్ చేసి చర్యలు తీసుకునే నిబంధన ఎమ్మెల్యేలకు ఎందుకు వర్తించకూడదని స్పీకర్ ప్రశ్నించారు. విశాఖపట్నంలో జరిగిన సభలో ఈ విషయం ప్రస్తావించగా 80 శాతం ప్రజలు తనతో ఏకీభవించారని స్పీకర్ తెలిపారు. లక్నోలో జరిగిన స్పీకర్ల సమావేశంలో జీతాలు తీసుకుంటూ అసెంబ్లీకి రాని వాళ్లను రీకాల్ చేయాలని సూచించానని చెప్పారు. చాలా దేశాల్లో రీకాల్ విధానం ఉందని, మనది ప్రజాస్వామ్య దేశం కావడంతో ఇలాంటి పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తోందని అన్నారు. చిన్న పిల్లల మాక్ అసెంబ్లీ అద్భుతంగా జరిగిందని స్పీకర్ తెలిపారు. మంత్రులు, ఎమ్మెల్యేల కంటే వారే బాగా మాట్లాడారని స్పీకర్ ప్రశంసించారు. ప్రస్తుతం పాఠశాలల నుంచి దాదాపు 200 అప్లికేషన్లు వచ్చాయన్నారు. విశాఖ నుంచి రాయలసీమ వరకు వివిధ ప్రాంతాల నుంచి పిల్లలు అసెంబ్లీని చూడడానికి వస్తున్నారని స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు.

## విజన్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా బడ్జెట్: ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

అమరావతి, ఫిబ్రవరి 17: ఏపీ శాసనసభలో బడ్జెట్‌పై చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడారు. ఈ బడ్జెట్ రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చేదిగా ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా భారీ బడ్జెట్ ప్రవేశపెట్టారని తెలిపారు. మూలధన వ్యయాన్ని భారీగా పెంచడం ద్వారా ఆస్తులు సమకూరుతాయన్నారు. రెవెన్యూ లోటును తగ్గించడం ద్వారా రాష్ట్ర భవిష్యత్తుపై నమ్మకం పెరిగిందని ఆయన అభిప్రాయపడ్డారువ్యవసాయ రంగంలో సాంకేతికత వినియోగాన్ని పెంచారని ఎమ్మెల్యే తెలిపారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు 50 వేల కోట్లకు పైగా కేటాయించడం ద్వారా ఇది నిజమైన రైతు ప్రభుత్వమని నిరూపించారని పుల్లారావు పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టుకు 6 వేల కోట్లకు పైగా నిధులు కేటాయించారని తెలిపారు. ధరల స్థిరీకరణ నిధి ద్వారా రైతులకు గిట్టుబాటు ధర



కల్పించే చర్యలు తీసుకున్నారని, రైతు నష్టపోతే రాష్ట్రం నష్టపోతుందని ఆయన అన్నారు.బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సంక్షేమానికి రూ. 91 వేల కోట్లు కేటాయించారన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా 'తల్లికి వందనం' పథకం ద్వారా విద్యార్థికి రూ. 15 వేలు అందిస్తున్నామని చెప్పారు. అత్యధిక సామాజిక భద్రత పెన్షన్లు ఇస్తున్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచిందని అన్నారు. పరిశ్రమలు, ఐటీ కంపెనీలకు ప్రోత్సాహకాలు ఇస్తున్నారని తెలిపారు. దేశంలో అత్యధిక పెట్టుబడులు సాధించిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని చెప్పారు. విజన్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా బడ్జెట్ రూపొందించారన్నారు.

## ధవలేశ్వరం బ్యారేజ్ గేట్లకు రూ.150 కోట్ల నిధులు: మంత్రి నిమ్మల రామానాయుడు



రాజమండ్రి, ఫిబ్రవరి 17:(శ్రీచక్ర) ధవలేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ గేట్ల దుస్థితిపై ఏబీఎన్ ఛానల్‌లో వరుసగా కథనాలు ప్రసారం అయ్యాయి. ఈ నేపథ్యంలో ఏపీ అసెంబ్లీ సమావేశాల్లో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కీలక ప్రకటన చేశారు. నాడు బ్యారేజ్‌కు నిధులు ఇచ్చిన చంద్రబాబే.. మళ్లీ నేడు ధవలేశ్వరం బ్యారేజ్ కొత్త గేట్ల ఏర్పాటుకు రూ. 150 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా పాడైపోయిన గేట్లను తొలగించి కొత్త గేట్లను అమర్చనున్నట్టు వెల్లడించారు.బ్యారేజ్‌లోని 117 గేట్లను తొలగించి వాటి స్థానంలో అధునాతనమైన కొత్త గేట్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ పనుల ద్వారా గోదావరి జలాలు సమర్థవంతంగా నిల్వ ఉండి, డెల్టా ప్రాంత రైతులకు సాగునీటి సమస్యలు తగ్గుతాయని ఆయన తెలిపారు. ఈ సీజన్‌లోనే అన్ని పనులు పూర్తి చేసి, కొత్త గేట్లను పూర్తి స్థాయిలో అమర్చనున్నట్లు మంత్రి రామానాయుడు ప్రకటించారు. టెండర్లు, ఇతర చర్యలు వేగంగా పూర్తి చేసి త్వరితగతంగానే కొత్త గేట్లను ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.గతంలో 2014-19లో ధవలేశ్వరం గేట్లు ప్రమాదకరంగా ఉన్నాయని.. టీడీపీ ప్రభుత్వంలో 58 కొత్త గేట్లు ఏర్పాటు చేసినట్లు మంత్రి గుర్తుచేశారు. తిరిగి ఇప్పుడు మిగిలిన 117 గేట్లను కూడా కొత్తవి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 2019-24 మధ్య కాలంలో ధవలేశ్వరం గేట్లు ప్రమాదకరంగా ఉన్నాయని సీడబ్ల్యూసీ హెచ్చరించినప్పటికీ గత ప్రభుత్వం పట్టించుకోలేదని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు.

## అనకాపల్లి జిల్లాలో భారీ అగ్నిప్రమాదం..



అనకాపల్లి జిల్లా, ఫిబ్రవరి17(శ్రీచక్ర) : అనకాపల్లి జిల్లాలోని పారిశ్రామిక కేంద్రమైన అచ్యుతాపురం జంక్షన్ సమీపంలోని కేఆర్ మార్ట్ లోభారీ అగ్నిప్రమాదంసంభవించింది. మంటలు వేగంగా వ్యాపించడంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. మార్ట్ లోపల అకస్మాత్తుగా మంటలు చెలరేగడాన్ని గమనించిన సిబ్బంది, వినియోగదారులు ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. వెంటనే పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది.. మంటలను ఆర్పివేస్తున్నారు. పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు.పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం.. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు అనుమానిస్తున్నారు. మార్ట్‌లోని వస్తువుల్లో ప్లాస్టిక్ సామగ్రి ఉండటంతో మంటలు క్షణాల్లో ఎగసిపడ్డాయి. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఫైర్ ఇంజన్ల సహాయంతో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. పొగలు చుట్టుపక్కల ప్రాంతాలకు వ్యాపించడంతో స్థానికులను అప్రమత్తం చేశారు.

నష్ట నివారణ.. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

## త్వరలో విజయవాడ రైల్వేస్టేషన్ మోడ్రనైజేషన్ పూర్తి: ఎంపీ కేశినేని శివనాథ్

విజయవాడ, ఫిబ్రవరి 17(శ్రీచక్ర) : విజయవాడ రైల్వే ప్రాజెక్టుల నిర్మాణం, పురోగతి అంశాలపై రైల్వే డీఆర్ఎంతో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ భేటీ అయ్యారు. ఈ సమావేశంలో వివిధ రైల్వే ప్రాజెక్టుల పనితీరు, కేంద్రం - రాష్ట్ర ప్రభుత్వాల సహకారం వంటి అనేక అంశాలను ఎంపీకి డీఆర్ఎం వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ.. రైల్వే ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్‌కు వచ్చేలా కృషి చేసిన రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ధన్యవాదాలు తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు ఢిల్లీ వెళ్లినప్పుడల్లా ఏపీకి రైల్వేలు, అమరావతి రైల్వే స్టేషన్, కొత్త రైల్వే లైన్లు ఈ బడ్జెట్‌లో ఉండేలా కృషి చేశారని తెలిపారు.విజయవాడ నగరంలోని పలు సమస్యలపై డీఆర్ఎంతో సుదీర్ఘంగా చర్చించినట్లు



ఎంపీ తెలిపారు. విజయవాడ రైల్వే స్టేషన్ ఆధునికీకరణకు సంబంధించి పార్లమెంట్‌లో తాము ప్రస్తావించగానే రైల్వే మంత్రి వెంటనే ప్రక్రియ ప్రారంభించారని తెలిపారు. నీతి ఆయోగ్ నుంచి అనుమతి వచ్చిందని, ప్రీ-బిడ్ మీటింగ్‌లు కూడా జరిగాయని ఎంపీ వెల్లడించారు. భారతదేశంలోనే అత్యంత రద్దీగా, అతిపెద్ద రైల్వే స్టేషన్లలో ఒకటైన విజయవాడ స్టేషన్ మోడ్రనైజేషన్ పూర్తి అయితే.. అమృత్ భారత్ రైల్వే స్టేషన్లను మించి ఆధునిక రూపం సంతరించుకుంటుందని ఎంపీ ఆశాభావం వ్యక్తం చేశారు. పీపీపీ మోడల్‌లో విజయవాడ రైల్వే స్టేషన్ అభివృద్ధి చేయబోతున్నారని తెలిపారు.అతి త్వరలోనే రాయనపాడు రైల్వే స్టేషన్.. అమృత్ భారత్ స్టేషన్‌గా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభం కాబోతోందని వెల్లడించారు. గుణదల రైల్వే స్టేషన్ కూడా అమృత్ భారత్ స్టేషన్ కింద ప్రారంభం అవుతుందని ఎంపీ ప్రకటించారు.

## ఐఏఎస్ శ్రీలక్ష్మికి సుప్రీంకోర్టులో చుక్కెదురు ..



మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసులో ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. జగన్ అక్రమాస్తుల కేసులో తన పేరును తొలగించాలని దాఖలు చేసిన డిశ్చార్జ్ పిటిషన్ సుప్రీంకోర్టు ధర్మాసనం కొట్టేసింది. హైకోర్టు తీర్పును సమర్థిస్తూ సుప్రీంకోర్టు ఈ పిటిషన్ రిజెక్ట్ చేసింది. ఓబులాపురం గనుల కేసులో నిబంధనలకు అనుగుణంగా వెళ్లానని ఐఏఎస్ శ్రీలక్ష్మి సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. అయితే శ్రీలక్ష్మి నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడ్డారని ,ఆమె మరిది భారీగా అక్రమాస్తులు సంపాదించారని సుప్రీంకోర్టుకు సీబీఐ వెల్లడించింది. ఆమె లంచం కూడా డిమాండ్ చేసినట్టు సాక్ష్యాలు వాంగ్మూలం ఇచ్చారని సుప్రీం ధర్మాసనానికి సీబీఐ అధికారులు తెలిపారు.

శ్రీచక్ర



# సంపాదకీయం

## ఏఐతో భవిష్యత్తు..

నలభై ఆరేళ్ల క్రితం అంటే 1980లో దేశంలో కంప్యూటరీకరణను విస్తరింప చేయాలని ప్రభుత్వం నిర్ణయించగా ఆందోళనలు తలెత్తాయి. 1984 సంవత్సరాన్ని 'యాంటీ కంప్యూటరైజేషన్ సంవత్సరం'గా పరిగణించారు. దీంతో తమ ఉద్యోగాలు పోతాయని, ఆర్థికంగా దెబ్బతింటాయని, దేశంలో తీవ్ర పరిస్థితులు తలెత్తుతాయని కార్మికులు నిరసన ప్రదర్శనలు సాగించారు. అయితే రానురాను డిజిటల్ టెక్నాలజీని అమలు లోకి విస్తారంగా తీసుకు రావడంతో సమాజంలోని అన్ని వర్గాల్లో, దేశం మొత్తం మీద ఆలోచనల్లో మార్పు రావడం ప్రారంభమైంది. కంప్యూటర్లు, ఆధునిక సాంకేతికత భారీగా ఉద్యోగాలు కల్పిస్తాయని, జీవితంలో అనేక విధాలుగా ఉపయోగపడతాయని నమ్మకం పెరిగింది. ఎఐ (కృత్రిమ మేధ) ఆధునిక ప్రపంచంలో కీలకమైన కేంద్రంగా వర్ధిల్లుతోంది. ఇప్పుడు ఎక్కడ విన్నా ఎఐ గురించే చర్చ వినిపిస్తోంది. మానవ చరిత్రలో ఇప్పటివరకు ఎన్నో పెద్దమార్పులు వచ్చాయి. కానీ ఇప్పుడు ఎఐ అన్నది అత్యంత శక్తివంతమైన, అతి గొప్ప ఆవిష్కరణల్లో ఒకటిగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రపంచ సాంకేతిక నాయకత్వంలో భారత్ అగ్రస్థానం సాధించాలన్న లక్ష్యంతో ఢిల్లీలోని భారత్ మండపంలో 'ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్' ప్రారంభం కావడం చెప్పుకోదగిన ఘట్టం. ఎఐ యుగం నియమాలు, ప్రమాణాలు, అవకాశాలను రూపొందించడంలో మనదేశం కీలకంగా ఉండాలనే ప్రధాన లక్ష్యంతో ఏర్పాటైన ఈ సదస్సు గురించి ప్రధాని మోడీ ఆశాభావం వ్యక్తం చేశారు. డిజిటల్ సదుపాయాల కల్పన, శక్తివంతమైన స్టార్టప్‌ల ఏర్పాటు, అత్యాధునిక పరిశోధనలు వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాల్లో భారత్ బాధ్యత మరింత పెరగనుందని వెల్లడించడం గమనార్హం. ఇప్పటికే దేశంలో ఆరోగ్య సంరక్షణ, విద్య, వ్యవసాయం, పరిపాలన, వంటి అనేక రంగాల్లో ఎఐ కీలక పాత్ర పోషిస్తోంది. ఇప్పుడు 22 రంగాల్లోని 17 రంగాల కంపెనీలు తమను తాము ఎఐ సాంతికత దిశగా మార్చుకోవలసిన ఒత్తిడి ఎక్కువగా ఉంది. ఎఐతో ఎక్కువ అనుబంధం ఉన్న ఐటి వంటి రంగాల్లో పెద్ద మార్పులు వస్తున్నాయి. మైక్రోసాఫ్ట్ ఎఐ సిఇఒ ముస్తఫా సులేమాన్ వచ్చే 18 నెలల్లో కంప్యూటర్ ఉద్యోగాలన్నీ ఎఐతో భర్తీ అవుతాయని అంచనా వేశారు. ఎఐ వల్ల 2035 నాటికి ప్రపంచ జిడిపి (స్థూల దేశీయోత్పత్తి) లో 15 శాతం పాయింట్లు పెరగవచ్చని ఏడాది క్రితం ప్రైస్ వాటర్ హౌస్ కూపర్స్ అనే సంస్థ అంచనా వేసింది. అంటే ప్రతి సంవత్సరం సుమారు 1 శాతం అదనపు అభివృద్ధి తథ్యమన్న అంచనాలు వెలువడ్డాయి. ఈ సదస్సు ఒక బలీయమైన జాతీయ ఎఐ పర్యావరణ వ్యవస్థను నిర్మించడానికి మాత్రమే ప్రయత్నించకుండా ప్రపంచ దక్షిణార్థ దేశాలను కూడా ఇందులో భాగస్వాములను చేయాలన్న తపన కనిపిస్తోంది. ఆయా దేశాలు కృత్రిమ మేధపై తమ ప్రణాళికలను ఈ వేదికపై వెల్లడించే అవకాశం కనిపిస్తోంది. అయితే ఎఐ ప్రణాళికలకు సంబంధించి భారత్ ముందు అనేక సవాళ్లు ఉన్నాయి. ఈ సాంకేతికతకు కావలసిన కనీస సెమీ కండక్టర్లు లేదా కంప్యూటర్ చిప్‌లు తయారు చేసే సామర్థ్యం ఇంకా భారత్‌కు అలవడ లేదు. ప్రస్తుతం దేశంలో ఎఐ సంపూర్ణ సామర్థ్యంతో ఏ కంపెనీ లేదు. అలాగే మెగా డేటా సెంటర్లు లేవు. పాత్రధారులు, నాటకం స్క్రిప్టు, కనీసం వేదిక లేకుండా ఏదైనా నాటకం ఎలా ప్రదర్శించలేరో అలాగే క్షేత్రస్థాయిలో కనీస మౌలిక అవసరాలులేకుండా ఎఐ సాంకేతికతను సాధించడం కష్టతరమే. అయినప్పటికీ ఎఐకి అనుకూలమైన పర్యావరణ వ్యవస్థ గత కొన్నేళ్లుగా ఏర్పడి చిగుళ్లు మొలకెత్తడం ప్రారంభమైంది. రెండేళ్లుగా సెమీకండక్టర్ల తయారీ అత్యంత నాటకీయంగా ఆవిర్భావమైంది. ఈ ఏడాది జనవరి నాటికి దేశం లోని ఆరు రాష్ట్రాల్లో 10 సెమీ కండక్టర్ తయారీ ప్రాజెక్టులు వచ్చాయని, వీటిలో కొన్ని ఆన్‌లైన్‌లో ఉన్నాయని ప్రభుత్వం అంచనాగా చెబుతోంది. ఇక రెండో అంశం.. దేశంలో మెగా డేటా సెంటర్ల ఏర్పాటును ప్రోత్సహించడం గత ఏడాది గూగుల్, అమెజాన్, మైక్రోసాఫ్ట్, డిజిటల్ కనెక్షన్, తదితర ప్రపంచ స్థాయి సాంకేతిక సంస్థలు 2030 వరకు ఎఐ, క్లౌడ్ మౌలిక సదుపాయాల్లో దాదాపు 68 బిలియన్ డాలర్ల వరకు పెట్టుబడులు పెట్టడానికి నిర్ణయం తీసుకున్నాయి. ఈ మేరకు చిప్ డిజైన్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ పర్యావరణం నెలకొల్పేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే చెప్పవచ్చు. ఈ సమయంలో ప్రభుత్వం నుంచి సరైన ప్రోత్సాహం లభిస్తేనే ఊపందుకుంటుంది. ఆయా ప్రపంచ స్థాయి సాంకేతిక సంస్థల అధినేతలు భారతదేశ సామర్థ్యం గురించి ఆశావహులుగా ఉన్నారు. జెన్‌సెన్ హుయాంగ్, గూగుల్ సిఇఒ సుందర్‌పిచాయ్, తదితరులు భావితరానికి ఎఐ సాంకేతిక కేంద్రంగా భారత్ వర్ధిల్లుతుందని, ఎఐని భారత్ ముందుకు తీసుకెళ్తుందని అభిప్రాయాలతో దృఢమైన విశ్వాసం వెలిబుచ్చడం గమనార్హం. భారత్‌లో మానవ వనరులకు లోటు లేదని, ఎఐ అమలు స్థాయి మరింత ముందుకు వెళ్తుందని చెబుతున్నారు. ఇప్పటికే ఎఐ ఫ్రంట్రన్నర్ చాట్ జిపిటిలో ప్రపంచం మొత్తం మీద రెండో భారీ మార్కెట్‌గా భారత్ ఉంటోందని ఆ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ సామ్ అల్ట్‌మాన్ అంగీకరించారు. ఎఐ నమ్మదగిన ముఖ్యమైన మార్కెట్‌గా అభివర్ణించారు. ఇవన్నీ ఎఐ సంస్థలకు భారత్ ఆకర్షణీయ కేంద్రంగా మారుస్తున్నాయి.

## పట్టణంలోని దేవాలయం భూమి విషయంలో అత్యుత్సాహం ప్రదర్శించిన మున్సిపల్ అధికారులపై, పట్టణ ఎస్ఐ పై చర్యలు తీసుకోవాలని, విశ్వహిందూ పరిషత్ నాయకులు డిమాండ్,





ఎమ్మిగనూర్, ఫిబ్రవరి, 17 (శ్రీ చక్ర):- ఎమ్మిగనూరు పట్టణంలోని సర్వే నెంబర్ 321 లో కోతులబావి గా ప్రసిద్ధి చెందిన శ్రీ భక్త ఆంజనేయ స్వామి వారి దేవాలయం దశాబ్దాల కాలం నాటి నుండి పూజాది నిత్య కైంకర్యాలతో విరాజిల్లుతున్నది.ఈ దేవాలయానికి తూర్పు మరియు దక్షిణం రెండు వైపులా రోడ్లు ఉన్నాయన్నారు. అయితే విలేజ్ మ్యాప్ లో రోడ్డు వెడల్పు ఎక్కువగా ఉన్నట్టు చూపడం ద్వారా ఆ స్థలంలో ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్ షాపులు నిర్మించి గుడి రాకపోకలను అడ్డుకోవాలని అత్యుత్సాహంగా ప్రయత్నిస్తున్నారని తెలిపారు.అక్కడే ఉన్న నాపరాళ్లతో రోడ్డు వైపుకు అడ్డంగా ప్రహరీ గోడను నిర్మించారని తెలిపారు.ఇది చాలా అన్యాయమైన చర్య అని గుడి ముందు ఉన్న రోడ్డు మార్జిన్ స్థలం దేవాలయం అవసరాలకు వాడుకోవాలే తప్ప ఆ స్థలంలో షాపులు నిర్మాణం చేస్తానని కమిషనర్ మాట్లాడటం వెనుక వారి యొక్క రహస్యం అజెండా సుస్పష్టమైతున్నది.నిన్న రాత్రి గుడిలో భక్తులు ఉండగా స్థానిక సీఐ తన సిబ్బందితో వచ్చి వెళ్లిపోవాలని హెచ్చరిక చేసి దౌర్జన్యం చేస్తూ ఇద్దరు భక్తులను తన్నడం జరిగిందని విశ్వహిందూ పరిషత్ నాయకులు తీవ్రంగా ఖండించారు.గుడికి వెళ్లే దారిలో మున్సిపల్ కమిషనర్ పాతిన నాపరాళ్ల ప్రహరీని వెంటనే తొలగించి గుడి రాకపోకలకు అంతరాయం కలిగించకుండా చూడాలని, అదేవిధంగా గుడి వ్యవహారంలో సిఐ దౌర్జన్యం చేయకుండా ఆదేశించి వారిద్దరి పైనే కాక,వారి వెనుక నడిపిస్తున్న అరాచక శక్తులపై కూడా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి ని పత్రిక ముఖంగా కోరుతున్నామని తెలిపారు.దక్షిణాంధ్ర ప్రాంత ఉపాధ్యక్షులు ఎర్రం విష్ణువర్ధన్ రెడ్డి,౹6:00 జూఎ, 17/2/2026౹ +91 97038 60909: దక్షిణాంధ్ర ప్రాంత సంయోజక పోలేపల్లి సందీప్ ,ప్రాంత విశేష సంపర్క ప్రముఖ తూముకుంట ప్రతాప్ రెడ్డి,ఆదోని జిల్లా అధ్యక్షులు అర్ధగిరి బసవన గౌడ్, టీడీపీ మాజీ కౌన్సిలర్ కోనేరు నాగేంద్ర ప్రసాద్,ఉపాధ్యక్షులు భీమారెడ్డి, కార్యదర్శి హనుమంత రెడ్డి, ప్రచార ప్రసార ప్రము కసిరెడ్డి, ఉపేంద్ర ధర్మ, రక్షక్ నరసన్న, సహ కార్యదర్శి శ్రీరంగా, గోరక్ష ప్రముఖ్ శ్రీరాములు యాదవ్,అధ్యక్షులు సత్యనారాయణ రెడ్డి,కార్యదర్శి మురళి హిందూ సోదరులంతా పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రహదారుల పై గుంతల పూడ్చివేత పనులను వేగవంతం చేయాలి

### రోడ్ల నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదు:జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి



కర్నూలు, ఫిబ్రవరి 17 (శ్రీచక్ర): రహదారుల పై గుంతల పూడ్చివేత పనులను వేగవంతం చేయాలని అదే విధంగా రోడ్ల నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లో రోడ్లకు సంబంధించిన పాట్ హోల్స్ పనుల పురోగతిపై కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గుంతలు లేని రోడ్లు ('పాట్ హోల్ ఫ్రీ రోడ్స్') నిర్మించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. రోడ్ల పరిస్థితి ఎలా ఉందనే దాని మన జిల్లాకు మంచి ర్యాంక్ తీసుకొని రావాలన్నారు. రోడ్ల మీద గుంతలు పూడ్చే పనులలో బడ్జెట్ ను సద్వినియోగం చేసుకొని సకాలంలో పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదనంగా బడ్జెట్ అవసరమైతే అందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలన్నారు. ప్రతిపాదనలు సిద్ధం చేసేటప్పుడు, ఏయే రోడ్లు అత్యంత అధ్వాన్నంగా ఉన్నాయో వాటికి ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలు ఎక్కువగా తిరిగే ప్రధాన రహదారులపై దృష్టి పెట్టాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.మీ పరిధిలో గుంతలు ఉన్న రోడ్డు పొడవు ఎంత ఉంది అందుకు సంబంధించి బడ్జెట్ ఎంత వచ్చింది? సంబంధిత పని ఎప్పటికి పూర్తవుతుంది? (ఇప్పటివరకు ఎంత పూర్తయింది?) అదనంగా బడ్జెట్ అవసరమైతే ప్రభుత్వానికి ప్రతిపాదనలు (ఖతీనీజూనీబజీశ్రీబ) పంపారా లేదా? అనే విషయాలను కలెక్టర్ ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్, కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోని, గూడూరు మున్సిపల్ కమిషనర్ లను, నేషనల్ హైవే ప్రాజెక్ట్ డైరెక్టర్ లను ఆరా తీసి అందుకు సంబంధించిన నివేదికలు సిద్ధం చేసి తనకు పంపాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఆర్అండ్ బి ఎస్ఈ మహేశ్వర రెడ్డి, కర్నూలు మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, పంచాయతీ రాజ్ ఇంజినీర్ శ్రీనివాసులు, వీడియో కాన్ఫరెన్స్ లో ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్ గంగి రెడ్డి, ఆదోని మున్సిపల్ కమిషనర్ నయీం అహ్మద్, గూడూరు మున్సిపల్ కమిషనర్, నేషనల్ హైవే ప్రాజెక్ట్ డైరెక్టర్ లు తదితరులు పాల్గొన్నారు.

## గంజహళ్లి గ్రామంలో రైతులు,మహిళలతో కలిసి అవేర్నెస్ ప్రోగ్రాం,





ఎమ్మిగనూరు,(రూరల్) ఫిబ్రవరి, 17 (శ్రీ చక్ర):- గోనెగండ్ల మండల పరిధిలోని గంజహళ్ళి గ్రామంలో డిఎస్పి భార్గవి,గోనెగొండ్ల సీఐ చంద్రబాబు, పోలీస్ సిబ్బందితో కలిసి గ్రామంలోని ప్రజలు ఎదుర్కొంటున్న ముఖ్యమైన సమస్యలు సైబర్ క్రైమ్,మహిళల భద్రత మరియుబాల్యవివాహాలుగురించి సంక్షిప్తంగా ప్రజలకు వివరించారు.గ్రామాల్లో చిన్న,చిన్న విషయాలు వలన జరిగే గొడవలు మరియు యాక్సిడెంట్లు గురించి, డ్రంకన్ డ్రైవ్, గ్రామాలలో శాంతిభద్రతలు విషయాలపై కఠినంగా వ్యవహరిస్తామని,పలు విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. డి. ఎస్. పి భార్గవి మాట్లాడుతూ సైబర్ క్రైమ్ గురించి ప్రజలు,మహిళలు చాలా అవగాహన కలిగి ఉండాలని సూచించారు.మహిళల భద్రత విషయంలో కూడా చాలా శ్రద్ధ వహించాలని గ్రామంలోని ప్రజలకు తెలియజేశారు. గ్రామంలోని బాల్యవివాహాలు జరగకుండా చూడాలని గ్రామస్తులను కోరారు.గ్రామాల్లో చిన్న,చిన్న విషయాలు వలన జరిగే గొడవలను నివారించాలని, యాక్సిడెంట్లు జరగకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఎవరైనా మద్యం తాగి వాహనాలు నడిపితే అటువంటి వారిని ఉపేక్షించేది లేదని డ్రంకన్ డ్రైవ్ గురించి కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. గ్రామంలోని ప్రతి ఒక్కరూ శాంతి భద్రతలను కాపాడడానికి సహకరించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అదేవిధంగా 23వ తేదీన జరిగే గంజహళ్ళి శ్రీ శ్రీ సద్గురు బడేసాహేబ్ స్వాములు ఉరుసు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతి ఒక్కరూ భక్తులు ప్రశాంతంగా జరుపుకోవాలని గ్రామ ప్రజలకు, గ్రామ పెద్దలకు తెలిపారు. గ్రామంలోని ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని గ్రామ ప్రజలకు సూచించారు.

## మార్కాపురం నూతన జిల్లా సమగ్ర అభివృద్ధి కోరుతూ జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసరావుకు వినతిపత్రం

మార్కాపురం ఫిబ్రవరి 17 ( శ్రీ చక్ర)మార్కాపురం జిల్లా సమగ్ర అభివృద్ధికి నిధులు కేటాయించి పనులు చేపట్టాలని, వెలుగొండ పనులు పూర్తి చేసి కాలువలకు నీళ్లు వదలాలని ప్రభుత్వాన్ని కోరుతూ జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీ పులి. శ్రీనివాసరావు కు వినతిపత్రం సమర్పించడమైనది. మార్కాపురం సిపిఐ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో “మార్కాపురం జిల్లా - వెలుగొండ జలాల సాధన సమితి” ప్రతినిధులు పలు డిమాండ్స్ ను ప్రభుత్వం ముందు పెట్టారు.1) మార్కాపురం నూతన జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి పనులు చేపట్టాలి. 2) జిల్లా పరిధిలోకి దొనకొండ, కుర్చేడు మండలాలు, వెలుగొండ ప్రాజెక్టు ప్రారంభ ప్రాంతాన్ని కలపాలి.3) వెలుగొండ ప్రాజెక్టు పనులు పూర్తి చేసి కాలువలకు నీళ్లు వదలాలి.4) గిద్దలూరు కేంద్రంగా డివిజన్ ప్రకటించాలి. 5)కంబం - బెస్తవారిపేట మండలాల మధ్య బస్సు డిపో, 100 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయాలి.6) సైనికులు, మాజీ సైనికులు, భద్రతా దళాల సిబ్బంది కోసం ఆసుపత్రి, సైనిక స్కూల్ ఏర్పాటు చేయాలి.డిమాండ్స్ తో కూడిన వినతిపత్రం కాపీలను సీఎం,డిప్యూటీ సీఎం, స్థానిక ఎమ్మెల్యేలు,రాష్ట్రఉన్నతాధికారులకు అంద చేయనున్నట్లు తెలిపారు.సమితి ప్రతినిధులు చెన్ను శివ ప్రసాద రావు-న్యాయవాది, సిపిఐ జిల్లా నాయకులు అందె నాసరయ్య, ఖాసీం, మాజీసైనికుల సంఘం నాయకులు శెట్లం వేణుగోపాల్, కెప్టెన్ అంకన్న, పూనూరు గురువారెడి, బీజేపీ నాయకులు జీవీ రమణా రావు, చేగిరెడ్డి రామకృష్ణరెడ్డి, మునగాల మురళీ కృష్ణ, తుపాకుల వెంకటేష్ పాల్గొన్నారు.



## షోడశ గుణాభిరాముడు శ్రీరాముడు: డాక్టర్ దోనేపూడి నరేశ్ బాబు

### జూలేపల్లిలో ప్రారంభమైన ధార్మిక కార్యక్రమాలు




గోస్పాడు, ఫిబ్రవరి 17 (శ్రీచక్ర): శ్రీరాముడు మర్యాద పురుషోత్తముడనిసకల గుణాభిరాముడైన శ్రీరాముడి నుండి ఈనాటి సమాజం నేర్చుకోవలసిన ఎన్నో విషయాలు ఉన్నాయని, రామాయణంలోశ్రీరాముడు 16 గుణాలతో శోభిల్లుతున్న లోకోత్తరమైన నాయకుడి చరిత్రను ఈనాటి సమాజం అధ్యయనం చేయవలసిన అవసరం ఎంతో ఉన్నదని తెలుగు పండితులు డాక్టర్ దోనెపూడి నరేశ్ బాబు అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో గోస్పాడు మండలం, జూలేపల్లి గ్రామంలోని శ్రీ సాయిబాబా మందిరం నందు ధార్మిక కార్యక్రమాలలో భాగంగా మొదటి రోజు శ్రీమద్రామాయణంలోని లోకోత్తర నాయకుడైన శ్రీరామచంద్రుడి యొక్క చరిత్రను భక్తులకు వివరించారు. ధార్మిక వ్యాప్తి కోసం తిరుమల తిరుపతి దేవస్థానములు ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తూ ఉందని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో నున్న సుబ్బరాయుడు, కె కృష్ణమూర్తి, రెడ్డి మధు, అడపా వెంకట సుబ్బయ్య, కె శివ, మంజుల రాముడుతోపాటు స్థానిక భక్త సమాజాల సభ్యులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ భూమిలో ఉన్న అక్రమ ప్లాట్లు ను తొలగించండి

### -డిప్యూటీ తహశీల్దార్ కు గ్రామస్తులు వినతిపత్రం అందజేత



మంత్రాలయం , ఫిబ్రవరి 17,(శ్రీచక్ర) : ప్రభుత్వ భూమిలో ఉన్న అక్రమ ప్లాట్లు ను వెంటనే తొలగించాలని గ్రామ కాలనీ వాసులు నేపాల్ , రత్నం , రంగన్న , సాల్మన్ లు మంగళవారం డిప్యూటీ తహశీల్దార్ రాఘవేంద్ర కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ మంత్రాలయం మండల పరిధిలోని చిలకలడోణ గ్రామంలోని సర్వే నెంబర్ 164,164ఈ1,164ని ,164డి1,164ఈలో పూర్తి విస్తీర్ణంలో 1.54 ఎకరా ప్రభుత్వ భూమిలో 10 మందికి పొజిషన్ లో ఉన్నారు.06-0 3- 2020 ఏపీ హైకోర్టును ఆశ్రయించగా పదిమందికి అనుకూలంగానే ఏపీ హైకోర్టు అనుమతి ఇచ్చింది. ఈ పదిమందిలో సుజానమ్మ ,, బుజ్జమ్మ ,ఎరుకల శివమ్మ, కుంద యేసయ్య, గజ్జి భాస్కర్ ఇంటి వరకు ప్రభుత్వ భూమి ఉంది. మూడు సెంట్లు కన్నా ఎక్కువగాఆక్రమించుకున్నారు. కావున వీరి పైన చట్టపరమైన చర్యలు తీసుకొని, అక్రమంగా ప్లాట్లు నిర్మించుకున్న ప్లాట్ ను విచారణ చేసి, స్థలము లేని నిరుపేద కుటుంబాలకు ఇవ్వాలని తెలిపారు. నిరుపేద ప్రజలకు మూడు సెంట్లు ప్లాట్ ఇచ్చి ఇల్లు కట్టించాలని, తెలిపారు. ఎస్సీ కాలనీలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ కు స్థలం కేటాయించి నిర్మాణం చేపట్టాలని అన్నారు. అనంతరం డిప్యూటీ తహసిల్దార్ రాఘవేంద్ర మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని విచారణ న్యాయం చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో చార్లెస్, శాంతిరాజు, ప్రకాశం దేవ సహాయం, సంసోను, లాజరు, మహానంది, స్వామి దాసు, కోర్నేలు, లక్ష్మన్న, యాకోబు, ప్రకాశం, ఏసేపు, సామ్ సోను, ప్రభాకర్, రంగప్ప, దేవారం, తేలన్న, తదితరులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీకి నష్టం కలిగించే విధంగా మాట్లాడితే చర్యలు తప్పవు మంత్రాలయం జనసేన పార్టీ ఇన్చార్జ్ బి. లక్ష్మన్న

మంత్రాలయం , ఫిబ్రవరి 17,(శ్రీచక్ర) : జనసేన పార్టీకి నష్టం కలిగించే విధంగా మాట్లాడితే పార్టీ పరంగా క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని మంత్రాలయం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బి. లక్ష్మన్న పేర్కొన్నారు.మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పెద్ద కడుబూరు మండలానికి చెందిన జీలకర గణేష్ అనే వ్యక్తి ఓ దినపత్రికలో నా గురించి , జనసేన పార్టీ పై అసత్య ఆరోపణలు చేస్తూ , నష్టం కలిగించే విధంగా మాట్లాడడం జరిగిందని , ఆయనకు షోకాజ్ నోటీసులు ఇవ్వడం జరిగిందన్నాం౹. దీనికి రెండు రోజుల్లో ఆయన వివరణ ఇవ్వాలని , లేనిపక్షంలో జనసేన పార్టీ పరంగా క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు.



## యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే, ఈ-కేవైసీ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలి:జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి



కర్నూలు, ఫిబ్రవరి 17 (శ్రీచక్ర): యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే ఈ-కేవైసీ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి ఎంపిడిఓ లు, మున్సిపల్ కమిషనర్ల ను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుండి జిల్లాలోని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే కు సంబంధించి ఇప్పటివరకు ప్రారంభించని 350 మంది స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు ల సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ ఎంపిడిఓ లు, మున్సిపల్ కమిషనర్ లను ఆదేశించారు. అలాగే పూర్ ప్రోగ్రెస్ ఉన్న సిబ్బందికి నోటీస్ లు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆదోని, తుగ్గలి, పత్తికొండ, ఆలూరు తదితర మండలాల్లో యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే కు సంబంధించి పెండింగ్ శాతం ఎక్కువ ఉందని ఎంపిడిఓ లను వివరణ అడిగారు..మున్సిపాలిటీ లలో కూడా ఎక్కువ పెండింగ్ ఉందని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని, అన్ని మండలాల్లో సర్వే ను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.. అలాగే హౌస్ హోల్డ్ ఈకేవైసీ 1.50 లక్షలు పెండింగ్ ఉందని, ఈ అంశంపై కూడా ప్రత్యేక దృష్టి సారించి, త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పి 4 కు సంబంధించి బంగారు కుటుంబాలను వెరిఫై చేసి వివరాలను పి 4 యాప్ లో నమోదు చేయాలని కలెక్టర్ ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు.. కంట్రోల్ రూమ్ ద్వారా ఈ అంశాలపై పర్యవేక్షణ చేస్తూ, వేగంగా పూర్తి చేసేలా చూడాలని కలెక్టర్ డిప్యూటీ సీఈవో ను ఆదేశించారు. టెలి కాన్ఫరెన్స్ లో జడ్పీ డిప్యూటీ సీఈవో, ఎంపిడిఓ లు, మున్సిపల్ కమిషనర్ లు పాల్గొన్నారు.

## జిల్లాలో ఆహార శుద్ధి యూనిట్ల ఏర్పాటును వేగవంతం చేయాలి:జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి



కర్నూలు, ఫిబ్రవరి 17 (శ్రీచక్ర): కర్నూలు జిల్లాలో ఆహార శుద్ధి యూనిట్ల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుపై ఏపిఎమ్ఐపి, డిఆర్డిఏ, బ్యాంక్ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రధానమంత్రి మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ ప్రైజస్ (ఖఓఈఓఇ) ఏర్పాటు లో భాగంగా 2025-26 ఆర్థిక సంవత్సరంలో 156 యూనిట్ల ఏర్పాటు లక్ష్యం కాగా, ఇప్పటివరకు 77 యూనిట్లు గ్రౌండింగ్ అయ్యాయన్నారు. ఇందుకు సంబంధించి బ్యాంకుల్లో పెండింగ్ ఉన్న దరఖాస్తులను త్వరితగతిన వెరిఫై చేసి అర్హత మేరకు అర్హులైన వారికి రుణాలు మంజూరు చేయించాలని కలెక్టర్ ఎల్ డి ఎం ను ఆదేశించారు. అర్హులైన లబ్ధిదారులకు యూనిట్ల మంజూరు లో జాప్యం ఉండకూడదన్నారు. గ్రౌండ్ అయిన ప్రతి యూనిట్‌కు సంబంధించి తప్పనిసరిగా ఫోటోలు తీసి సంబంధిత పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, యూనిట్ల ఏర్పాటు లో ఏమైనా సాంకేతిక ఇబ్బందులు ఎదురైతే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఏ పి ఎమ్ ఐ పి పిడి, ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఈ డి శ్రీనివాసులు, డిఆర్డిఏ పిడి రమణారెడ్డి, ఎల్డిఎం రామచంద్రరావు, బ్యాంక్ అధికారులు తదితరులు పాల్గొన్నారు

## అసంపూర్తిగా నిలిచిపోయిన సచివాలయం-2 నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలి,



పెద్దకడుబూరు,ఫిబ్రవరి,17(శ్రీచక్ర):- పెద్దక డబూరు గ్రామంలోని అసంపూర్తిగా ఉన్న సచివాలయం- 2 నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని ఎస్సీ కాలనీవాసులు ఎంపీడీవో కు వినతి పత్రం అందజేశారు. మండలంలోని నెలకొన్న సమస్యలు పరిష్కారం కోసం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. అసంపూర్తిగా నిలిచిపోయిన సచివాలయం - 2 నిర్మాణపు పనులను వెంటనే పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని వారు కోరారు. ఇప్పటివరకు 16 . 78 లక్షలు నిధులు మంజూరు అయ్యాయని, ఆ నిధులతో ఏ ఏ పనులను పూర్తి చేశారో సమగ్ర విచారణ జరిపి తక్షణమే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

# 1-19 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరూ ఆల్బెండజోల్ మాత్రలు వాడి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలి:జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి





కర్నూలు, ఫిబ్రవరి 17 (శ్రీచక్ర): జిల్లాలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని 1 నుండి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి తెలిపారు. పిల్లల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఈ కార్యక్రమాన్ని జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాలలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. మంగళవారం నగరంలోని ఇందిరాగాంధీ స్మారక ఉన్నత పాఠశాలలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలో మొత్తం 4,400 ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు ఉండగా, సుమారు 6 లక్షల 57 వేల మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. వీరందరికీ ఆల్బెండజోల్ మాత్రలు అందజేసి నులిపురుగుల నివారణ చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.. ఈ కార్యక్రమంపై విస్తృత అవగాహన కల్పించేందుకు గ్రామాల్లో టామ్-టామ్ ప్రకటనలు, బస్టాండ్‌లు, ప్రధాన కూడళ్లలో విస్తృతంగా ప్రచారం నిర్వహించామని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలు తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు తీసుకునేలా చేసి వారి ఆరోగ్యాన్ని పరిరక్షించాలని కలెక్టర్ సూచించారు.×పదవ తరగతి విద్యార్థులు లక్ష్యసాధనపై దృష్టి పెట్టాలిప్రతి విద్యార్థి పదవ తరగతిలో మంచి ఫలితాలు సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ప్రభుత్వం పదవ తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు ప్రత్యేకంగా "వంద రోజుల ప్రణాళిక" రూపొందించినట్లు తెలిపారు. ఈ యాక్షన్ ప్లాన్‌ను సద్వినియోగం చేసుకొని బలహీనంగా ఉన్న సబ్జెక్టు లో పట్టు సాధించాలని విద్యార్థులకు సూచించారు. పదవ తరగతి వరకే చదువు ఆపకుండా, ఇంటర్మీడియట్ మరియు డిగ్రీ వరకు విద్యను కొనసాగించాలని ప్రోత్సహించారు.×బాల్య వివాహాలపై అవగాహన ? విద్యార్థులకు సూచనలుపదవ తరగతి చదువుతున్న ఆడపిల్లలకు ఇంట్లో వివాహాల కోసం ఒత్తిడి తీసుకువస్తే, ఆ విషయాన్ని ఉపాధ్యాయులకు తెలియజేయాలని విద్యార్థులకు కలెక్టర్ సూచించారు. తమ కాళ్ల మీద నిలబడిన తరువాతే వివాహం చేసుకోవాలని హితవు పలికారు. విద్య ద్వారా సాధికారత పొందడం ఎంతో ముఖ్యమని, తల్లిదండ్రులు కూడా ఈ విషయాన్ని గమనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్వో డా. భాస్కర్, ఐసిడిఎస్ పి.డి విజయ, కార్పొరేటర్ పద్మలత, విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అసుదుల్లా ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

# సూపర్ సిక్స్ అంటూ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పై విరుచుకుపడిన మండల వైసీపీ ఎంపీపీ గొల్ల కేశన్న,



ఎమ్మిగనూర్, ఫిబ్రవరి, 17 (శ్రీ చక్ర):- ఎమ్మిగనూరు నియోజకవర్గ వైసీపీ ఇన్చార్జ్ ఎర్రకోట రాజీవ్ రెడ్డి ఆదేశాల మేరకు ఎమ్మిగనూరు వైసిపి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండల వైసీపీ ఎంపీపీ గొల్ల కేశన్న మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. కూటమి ప్రభుత్వ పాలకుల వైఫల్యాలపై ఒక గట్టి హెచ్చరికగా నిలిచింది.ఎన్నికల ముందు ప్రజలను ఆకట్టుకోవడానికి కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు నేటికీ అమలు చేయకుండా మాటలకే పరిమితమైపోయిందని స్పష్టం చేశారు.ముఖ్యంగా బీసీ వర్గానికి సంబంధించి 50 సంవత్సరాలు అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పెన్షన్ ఇస్తామని చెప్పి ప్రతి నియోజకవర్గంలోని గంటాపదంగా పెన్షన్స్ ఇస్తామని చెప్పడం అటువంటి హామీ అమలు చేయడం కష్టమని తెలిసినా కూడా అధికారంలోకి రావడం కోసం కూటమి ప్రభుత్వం అన్ని తప్పుడు హామీలను ఇచ్చి ప్రజలను మభ్య పెట్టే విధంగా ఓటర్లను ఆకర్షించాయి తప్ప చేసిందేమీ లేదంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు.కొత్త పెన్షన్లు ఇవ్వడం అటుంచి ఇప్పటికే ఉన్న పెన్షన్లను కూడా అర్హత లేదు అనే కారణాలు చూపుతూ తొలగించడం ద్వారా కూటమి ప్రభుత్వం ప్రజలను నట్టేట ముంచుతోందని ఆయన మండిపడ్డారు.వృద్ధులు, వికలాంగులు, వితంతువులు లాంటి బలహీన వర్గాలపై ఈ విధమైన వైఖరి ప్రభుత్వ మానవత్వహీన పాలనకు నిదర్శనం అన్నారు.పింఛన్ అనేది దయ కాదు అది ప్రజల హక్కు అని గుర్తుచేస్తూ, ఆ హక్కునే కాలరాస్తున్న కూటమి ప్రభుత్వం ప్రజాపాలన ఎలా పరిపాలన చేస్తుందని విరుచుకుపడ్డారు.కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండేళ్లు పూర్తవుతున్నా ఒక్క కొత్త పెన్షన్ కూడా ఇవ్వలేని దౌర్భాగ్య పరిస్థితిలో ప్రభుత్వం ఉందని స్పష్టం చేశారు.రాష్ట్రవ్యాప్తంగా దాదాపు రెండు లక్షల యాభై వేల కొత్త పెన్షన్లు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉండటం ప్రభుత్వ వైఫల్యానికి స్పష్టమైన నిదర్శనమని అన్నారు.ప్రజల అవసరాలను గుర్తించడంలో వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైన కూటమి పాలనా అని విరుచుకుపడ్డారు.ప్రతిపక్ష నాయకులు పెన్షన్ల అంశంపై ప్రశ్నలు లేవనెత్తితే మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఐదేళ్లలో కేవలం సంవత్సరానికి ఒక్కసారి 250 రూపాయలే పెంచారు అంటూ ఎద్దేవా చేయడం రాజకీయంగా ఎంత దిగజారుడో అని ఆయన ప్రశ్నించారు.ప్రజా సమస్యలపై సమాధానం చెప్పలేని ప్రభుత్వం ఎద్దేవాలతో తప్పించుకోవాలని చూస్తే అది పాలనా వైఫల్యానికి నిలువెత్తు నిదర్శనం అని విమర్శించారు.ఈ పెండింగ్ పెన్షన్ల పరిస్థితి ఎమ్మిగనూరు శాసనసభ్యులకు తెలియదా ప్రజల బాధలు వారికి కనిపించడం లేదా అని ఆయన ఎమ్మెల్యే బీవిని తీవ్రంగా ప్రశ్నించారు.వృద్ధులు, వికలాంగులు, వితంతువులు కొత్త పెన్షన్ల కోసం సచివాలయాల చుట్టూ తిరుగుతూ ఎప్పుడెప్పుడు మాకు కొత్త పెన్షన్లు ఎప్పుడు వస్తాయని ఎదురుచూస్తున్న వికలాంగుల, వితంతువులు కళ్ళు కాచిపోతున్నాయని కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యానికి చాలామంది పింఛన్లు రాక బలైపోతున్నారని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.కూటమి ప్రభుత్వం హామీల ప్రభుత్వం కాదు మోసాల ప్రభుత్వంగా మారిందని మాటల పాలన మాత్రమే తప్ప ప్రజల పాలన చేయడం చేతగాని కూటమి ప్రభుత్వమని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అబద్ధాలు మాయ మాటలతో రైతులకు అన్నదాత సుఖీభవ, పంట నష్టపరిహారం,ఇన్పుట్ సబ్సిడీ కానీ రైతులకు అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి కావస్తున్న ఇంతవరకు రైతులకు ఏ ఒక్క రూపాయి కూడా పంట నష్టపరిహారం చెల్లించకపోవడంపై ప్రజలు,మహిళలు కూటమి ప్రభుత్వానికి రాబోవు రోజుల్లో తగిన బుద్ధి చెబుతారని వారు గట్టిగా హెచ్చరించారు.ప్రజల సమస్యలపై బాధ్యత తీసుకోలేని ఈ ప్రభుత్వానికి ప్రజలే తగిన సమయంలో తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.పెన్షన్ల అంశంపై రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలకు సిద్ధమవుతామని ప్రజల హక్కుల కోసం నిరంతరం వైసీపీ పార్టీ అన్నదాతల కోసం నిరంతరం పోరాడుతామని వారు స్పష్టం చేసారు.

## కెసి కెనాల్ పరిశుభ్రతలో ప్రజల పాత్ర కీలకం నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్





కర్నూలు, ఫిబ్రవరి 17 (శ్రీచక్ర): నగర పరిధిలో కెసి కెనాల్‌ను పరిశుభ్రంగా పరిరక్షించడంలో ప్రజల సహకారం అత్యంత కీలకమని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఇంజనీరింగ్, జలవనరుల శాఖ అధికారులతో కలిసి కార్ల్ మార్క్స్ నగర్, అశోక్ నగర్, వినాయక ఘాట్ ప్రాంతాల్లో కెసి కెనాల్‌ను పరిశీలించారు.కెనాల్‌లో చెత్తాచెదారం పారవేయకుండా నగరపాలక సంస్థ శానిటేషన్ సిబ్బంది, జలవనరుల శాఖ లస్కర్లు ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. దెబ్బతిన్న ప్రదేశాల్లో రక్షణ వలయానికి తక్షణ మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. కెనాల్‌లోకి డ్రైనేజీ కాలువల నీరు చేరుతున్న ప్రాంతాలను గుర్తించి, వాటి మళ్లింపుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నడిబొడ్డున ప్రవహించే కెనాల్ నగరానికి అందాన్ని చేకూర్చేదిగా ఉండాలని, అయితే పరిసర ప్రాంతాల ప్రజలు చెత్త పారవేయడం వల్ల అపరిశుభ్ర పరిస్థితులు నెలకొనడం ఆవేదనకరమన్నారు. నీటి ప్రవాహం లేని సమయంలో పరిస్థితి మరింత దయనీయంగా తయారై, దోమలు తదితర విషకీటకాలు విస్తరించి ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతాయని తెలిపారు. రక్షణ వలయాలను ధ్వంసం చేసి చెత్త పారవేయడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. కెనాల్ శుభ్రత, మరమ్మతుల కోసం ప్రజాధనం వ్యయమవుతోందని గుర్తుచేశారు. కెసి కెనాల్‌లో త్వరలో స్వచ్ఛత పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు బాధ్యతతో వ్యవహరించి ఇకపై చెత్తను నగరపాలక వాహనాలకు అప్పగించాలని కమిషనర్ కోరారు.కార్యక్రమంలో జలవనరుల శాఖ ఎస్ఈ బాలచంద్ర రెడ్డి, నగరపాలక సంస్థ ఎస్ఈ రమణమూర్తి, డిఈఈ ప్రసాద్, ఎంఈ మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ



మంత్రాలయం , ఫిబ్రవరి 17,(శ్రీచక్ర) : అమరావతి పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ వారి ఆధ్వర్యంలో ఈ నెల13, నుంచి 16 వ తేదీల్లో కర్నూల్ అవుట్డోర్ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు మంత్రాలయం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరించి బంగారు, రజితం, కాంస్య పథకాలు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు విఠోభరావు మంగళవారం తెలిపారు. పదవ తరగతి విద్యార్థి యం.చిన్న నాగయ్య 120 ,180 కేజి ల లిఫ్ట్ కేటగిరీలో రాష్ట్రస్థాయిలో మూడు బంగారు పతకాలు ,9వ తరగతి విద్యార్థి వై. నరసింహ 53 కేజిల కేటగిరీ లో170 కేజీ ల బరువు ఎత్తి రాష్ట్ర స్థాయిలో బంగారు పతకం ,పదవ తరగతి విద్యార్థి యం వినాయ్ 63 కేజీ కేటగిరీలో 200 కేజి ల బరువు ఎత్తి రాష్ట్ర స్థాయిలో రజిత పథకం ,తొమ్మిదవ తరగతి విద్యార్థి టి. వెంకటేష్ 59 కేజిల కేటగిరీ లో 185 కేజి బరువు ఎత్తి రాష్ట్రస్థాయిలో కాంస్య పథకం సాధించినట్లు ఆయన తెలిపారు. అలాగే కేశవ్, ఉదయ్, శ్రీరామ్ లు రాష్ట్ర స్థాయి పోటీల వివిధ కేటగిరిలో చక్కటి ప్రతిభ కనబరచి పథకాలు సాధించిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు విటోభరావు ప్రత్యేకంగా అభినందించారు, ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రశేఖర్, వీరేష్ రావు, రామచంద్ర, సుల్తానా , ఉమామహేశ్వరి, రవీంద్ర, నరసింహ రాజు, హరి ప్రసాద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## పట్టణంలోని గద్దిరాల మారెమ్మ అవ్వకి ప్రత్యేక పూజలు,



ఎమ్మిగనూరు,(టౌన్) ఫిబ్రవరి,17 (శ్రీ చక్ర):- పట్టణంలో వెలసిన శ్రీ శ్రీ గద్దిరాల మారెమ్మ అమ్మవారికి అమావాస్య కావడంతో గద్దిరాల మారెమ్మ అవ్వకి ప్రత్యేక పూజలు అనంతరం అభిషేకం,కుంకుమార్చన, పల్లకి సేవ, ధూప,దీప నైవేద్యాలతో అలంకరణ పూజా కార్యక్రమాన్ని ఎంతో అంగరంగ వైభవంగా జరిపారు. భక్తులకు మధ్యాహ్నం నుండి అన్నదాన కార్యక్రమాలతో పాటు భక్తిశ్రద్ధలతో భక్తులు భారీ సంఖ్యలో పూజా కార్యక్రమాల్లో పాల్గొని, అన్నదాన కార్యక్రమంలో కూడా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బాధితులకు సీఎం ఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ,



కౌతాళం, ఫిబ్రవరి, 17( శ్రీ చక్ర): కౌతాళం మండల కేంద్రంలోని ఉరుకుంద ఈరన్న మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ చెన్న బసప్ప స్వగృహంలో కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులు తిక్కారెడ్డి ఆదేశాల మేరకు బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఉరుకుంద ఈరన్న మాజీ టెస్ట్ బోర్డ్ చైర్మన్ చెన్న బసప్ప, కొత్రేష్ గౌడ్ ,దమ్ములదిన్నె సర్పంచ్ రమేష్ గౌడ్ చేతుల మీదుగా బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. బాధితులకు మొత్తం 5 మంది లబ్ధిదారులకు కలిపి రూ. 2,07306 /-లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందించారు. ఈ కార్యక్రమంలో ఉరుకుంద మాజీ ఎంపీటీసీ కురుగోడప్ప, ఎరిగేరి మాజీ సర్పంచ్ శేఖర్,ఉపరహాలు గోపాల్ రెడ్డి,సిద్ధూ, మంజునాథ, చిరంజీవి, ఎరిగేరి,గిడ్డయ్య , తిక్క రెడ్డి వర్గ టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## నులిపురుగుల నివారణ పై అవగాహన కార్యక్రమం



కోట: ఫిబ్రవరి 17 (శ్రీ చక్ర): నులిపు రుగులు నివారణ కార్యక్రమంపై మంగళవారం కోట మండలంలోని శ్యామసుందర పురం గ్రామాలలోని ఎంపీపీ స్కూల్,అంగన్వాడి కేంద్రాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డి ఎమ్ హెచ్ ఓ పద్మావతి,ఎమ్ ఈ ఓ దారా. మస్తానయ్య,చిట్టేడు సిహెచ్‌సీ క్లస్టర్ డాక్టర్ నాగరాజు పిల్లలకు చేతులు శుభ్రం చేసుకునే దశలను వివరించి, ఎప్పుడెప్పుడు చేతులను పరిశుభ్రం చేసుకోవాలో వివరించారు. ఏఎన్ఎం ఆల్బండోజోలు మాత్రలు అందరూ వేసుకోవాలని,నులిపురుగులు ఏ విధంగా జకారణం అవుతాయో వివరించారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు,పిల్లలు పాల్గొన్నారు.

## వృద్ధాప్యంలో ఉన్న తన ఇంటిని, లాక్కొని, రోడ్డున పడేశారు..

### జాయింట్ కలెక్టర్ వినతి పత్రం ఇచ్చిన వృద్ధుడు యేసయ్య...



మార్కాపురం ఫిబ్రవరి 17 (శ్రీ చక్ర)మార్కాపురం జిల్లా కేంద్రంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో హనుమంతుని పాడు మండలం హనుమంతపురం గ్రామానికి చెందిన 73 సంవత్సరాలు గలిగిన వృద్ధుడు తలారి ఏసయ్య తన ఇంటిని లాక్కొని వీధిన గెంటివేశారని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు అనారోగ్య సమయంలో మతిస్థిమితం లేనప్పుడు తన బంధువులు వేలిముద్రలు వేయించుకొని తన ఇంటిని కాజేశారన్నారు. అనంతరం తన ఇంటిని వేరే వారికి విక్రయించడంతో వారు తన ఇంటి మీదికి వచ్చి దౌర్జన్యంగా బెదిరిస్తూ ఇంటిని ఖాళీ చేయాలని ఇంట్లో ఉన్న వస్తువులను రోడ్డు మీద పడవేశారన్నారు. తనకు ఎవరూ లేరని తల దాచుకుంటున్న ఇంటిని కూడా బంధువులు అత్యాశతో అక్రమంగా ఇతరులతో కలిసి నాకు అన్యాయం చేశారని ఆరోపించారు. సంబంధిత అధికారులు తనకు నీడనిచ్చే నా ఇంటిని ఇతరుల చెర నుండి, విడిపించి తనకు న్యాయం చేయాలని వృద్ధుడు జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులను కోరారు.

# అక్రమంగా దొడ్డిదారి పట్టిస్తున్న పాఠశాల రేషన్ బియ్యం,

**బాధ్యులైన పాఠశాల ప్రధానోపాధ్యాయుణ్ణి వెంటనే సస్పెండ్ చేయాలి.**
**:ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు యస్.ఈరేష్ డిమాండ్**






కౌతాళం,ఫిబ్రవరి, 17 (శ్రీ చక్ర):-కౌతాళం మండలంలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఎమ్మార్వో, కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించారు. మండల ఆర్ఐ తిక్క స్వామి,ఎంఈఓ శోభారాణి కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులుసాయివర్మ,హనుమేష్, స్వామి,గోవిందు,భీమయ్య, ఐనూర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు యస్.ఈరేష్ మాట్లాడుతూ ప్రభుత్వం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద పేద,బడుగు వెనుకబడిన వర్గాల పిల్లలకు పోషకాహారం అందించేందుకు కేటాయించిన రేషన్ బియ్యాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అక్రమంగా తరలించి, వ్యక్తిగత లాభం కోసం దుర్వినియోగం చేస్తున్నారని తెలిపారు. ఇటీవలి నిన్నటి రోజున మధ్యాహ్న సమయంలో పాఠశాలకు సంబంధించిన బియ్యాన్ని వాహనాల ద్వారా బియ్యం తీసుకెళ్లడం జరిగిందని ఇది కేవలం ఆర్థిక అవినీతి మాత్రమే కాకుండా పిల్లల పోషణ హక్కును భరించడమే కాక ప్రభుత్వ పథకాన్ని దుర్వినియోగం చేయడమే ఇందుకు నిదర్శనం అని తెలిపారు. ఇలాంటి అక్రమాల వల్ల పాఠశాలలో విద్యార్థుల భోజన నాణ్యత దెబ్బతింటుందన్నారు. తల్లిదండ్రుల్లో కూడా పూర్తిగా అసంతృప్తి పెరిగిందన్నారు. కావునా సంబంధిత ప్రధానోపాధ్యాయుడిపై తక్షణమే విచారణ జరిపి, సస్పెండ్ చేయాలని,అలాగే సమాజంలో అవినీతి అక్రమాలను వెలికి తీసే విలేకరుల పైన దురుసుగా ప్రవర్తించడమే కాకుండా వారిపై కేసులు పెడతామని వారిని ప్రధానోపాధ్యాయులు బెదిరించడం ఎంతవరకు సమంజసమని తెలిపారు. అలాంటి ప్రధానోపాధ్యాయుడును తక్షణమే సస్పెండ్ చేయాలని తెలిపారు. అక్రమంగా తరలించిన బియ్యం మొత్తాన్ని గుర్తించి, ఆర్థిక నష్టాన్ని వసూలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ, సివిల్ సప్లైస్, విజిలెన్స్ శాఖలతో సంయుక్తంగా స్వతంత్రంగా విచారణ నిర్వహించాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి అవకతవకలు జరగకుండా బియ్యం సరఫరా, నిల్వ, వినియోగంపై కఠినంగా మానిటరింగ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాలు ఇచ్చిన నివేదికపై స్పందించిన ఎమ్మార్వో,ఎంఈఓ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి పాఠశాల ప్రధానోపాధ్యాయుడిపై విచారణ చేసి, వాస్తవాలను తెలుసుకొని చర్యలు తీసుకుంటామని విద్యార్థి సంఘాలకు హామీ ఇచ్చారు. ఇప్పటికైనా మండల అధికారులు స్పందించిచర్యలు తీసుకో లేని పక్షంలో పెద్ద ఎత్తున అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు

# వి ఆర్ ఏ ల సమస్యలు పరిష్కరించాలి...,కోట వి ఆర్ ఏ ల డిమాండ్స్...,



కోట :ఫిబ్రవరి 17 (శ్రీ చక్ర): గ్రామ రెవెన్యూ సహాయకులు సమస్యలు పరిష్కారం చేయాలని కోట గ్రామ రెవెన్యూ సహాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించ నున్న నేపథ్యంలో గ్రామ రెవెన్యూ సహాయకులు పాల్గొనడానికి పర్మిషన్ ఇవ్వాలని కోట తాహాసిల్దార్ కటారి.జయ జయ రావుకు వినతి పత్రాన్ని అందజేశారు. ధర్నాను ఉద్దేశించి వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ వ్యవస్థలో సుమారు 20 వేల మంది గ్రామ రెవెన్యూ సహాయకులుగా పనిచేస్తున్నామన్నారు. డిపార్ట్‌మెంట్ లో దిగువ స్థాయిలో పనిచేస్తూ ప్రజలతో నిత్య సంబంధాలు కలిగి ఉన్నామని, డిపార్ట్‌మెంట్ ద్వారా ప్రజా సమస్యలు పరిష్కారానికి ప్రధాన పాత్ర పోషిస్తున్నామన్నారు. గ్రామాల్లో నివసిస్తూ అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వం ద్వారా ప్రజలకు సేవ చేస్తున్నామన్నారు. రెవెన్యూ శాఖలో సుదీర్ఘకాలం నుండి చాలా తక్కువ వేతనంలో పనిచేస్తున్నామన్నారు. గ్రామ రెవెన్యూ సహాయకులు పార్ట్ టైం ఉద్యోగులు అయినా,రాత్రి,పగలు తేడా లేకుండా పనిచేస్తున్నామని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం వీజరీలకు తీవ్రమైన అన్యాయం చేసిందన్నారు. గత వైసిపి ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా వేతనం పెంచలేదన్నారు. వేతనం పెంచకపోగా డిఎని కూడా ఉపసంహరించి రికవరీ చేశారని చెప్పారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక అయినా జీతాలు పెరుగుతాయని ప్రమోషన్లు అమలు చేస్తారని విఆర్ఏలు ఆశించామన్నారు. కానీ గడిచిన 9 నెలల కాలంలో కూటమి ప్రభుత్వం వి ఆర్ ఏ ల సమస్యలు ఏ ఒక్కటి పరిష్కరించలేదన్నారు. నిబంధనకు విరుద్ధంగా నైట్ వాచ్మెన్,అటెండర్ డ్యూటీలు చేస్తున్నారు. ఇదే గాక రీ సర్వే పేరుతో మైళ్ళకొద్ది దూరం ఇతర ప్రాంతాలకు వెళ్లి పని చేయాల్సి వస్తుందన్నారు. అదనపు పని భారం పెంచినందుకు అవసరమైన టి ఏ డి ఏ లు గురించి పట్టించుకోలేదన్నారు. అదనపు పనిభారానికి ఆర్థిక సమస్యలు కూడా తోడవడంతో వీ అర్ ఏ ల కుటుంబాలు పస్తులతో గడపాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. గ్రామ రెవెన్యూ సహాయకులకు గత 8 సంవత్సరాల నుండి జీతాలు పెరగలేదు,జీతం పెరగకపోగా ధరలేమో ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. మన పొరుగును ఉన్న తెలంగాణ రాష్ట్రంలో ఏఆర్ఎలకు మూడేళ్లుగా ఆ రాష్ట్ర ప్రభుత్వం పే స్కేలు ఇచ్చి ఆదుకుంటుందన్నారు. మన రాష్ట్రంలో కూడా పే స్కేలు జీవితాలు ఇవ్వాలని మంత్రులు, అధికారులు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నప్పటికీ కనికరించడం లేదన్నారు. చదువుకున్న వి ఆర్ ఏ లు ఎప్పటికైనా వీఆర్వో ప్రమోషన్ వస్తుందని ఆశగా ఎదురుచూస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం మాత్రం ప్రమోషన్ ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. ప్రమోషన్ కొరకు ఎదురుచూస్తున్న వీఆర్ఎలకు వయోభారం పెరుగుతుందన్నారు. దళిత,గిరిజన మైనార్టీ బడుగు బలహీన వర్గాల కు చెందిన వి ఆర్ ఏ ల కుటుంబాలను ఆకలి బాధల నుండి ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. అక్రమ డ్యూటీలు రద్దు చేసి వాచెన్లు, అటిండర్లు ఎక్కడైతే అవసరమో అక్కడ సీనియార్టీ ఉన్నటువంటి వీ అర్ ఏ లను శాశ్వత ప్రాతిపదికన నియమించాలని కోరుతున్నామన్నారు. కనుక గ్రామ రెవెన్యూ సహాయకులు పట్ల సానుభూతితో వ్యవహరించి మా సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. గ్రామ రెవెన్యూ సహాయకులకు తక్షణమే పే స్కేల్ అమలు చేయాలనీ, అర్హులైన వీఆర్వోలకు ప్రమోషన్లు ఇవ్వాలనీ,ఏళ్ల తరబడి నామినీలుగా పనిచేస్తున్న వారిని విఆర్ఎలుగా నియమించాలనీ, అటెండర్ నైట్ వాచ్మెన్ ప్రమోషన్ కోటాను 20 నుండి 70 శాతం పెంచాలనీ,అక్రమ డ్యూటీలు రద్దు చేయాలనీ డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో గ్రామ రెవెన్యూ సహాయకులు సుబ్రహ్మణ్యం, రమణ,సౌజన్య,మణి,అనిత, తదితరుల వి ఆర్ ఏ లు పాల్గొన్నారు.

# శ్రీసిటీలో మరో దిగ్గజ ఏసీ కంపెనీ

### - క్యారియర్ కొత్త తయారీయూనిట్‌కు లీజ్ ఒప్పందం




శ్రీ సిటీ ఫిబ్రవరి 17(శ్రీ చక్ర)గ్లోబల్ హీటింగ్, వెంటిలేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్ రంగంలో అగ్రగామిగా ఉన్న క్యారియర్ ఎయిర్‌కండిషనింగ్ ఉ రిఫ్రిజరేషన్ లిమిటెడ్ సంస్థ శ్రీసిటీలో కొత్త తయారీ కేంద్రం స్థాపనకు లీజ్ డీడ్‌పై సంతకం చేసింది. ఈ మేరకు తిరుపతి జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్ సమక్షంలో క్యారియర్ మేనేజింగ్ డైరెక్టర్ సుందరేశన్ నారాయణన్, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి పరస్పరం ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా డా. వెంకటేశ్వర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం సులభతర వ్యాపారం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) మాత్రమే కాకుండా వేగవంతమైన అమలు (స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) విధానానికి కట్టుబడి ఉందని తెలిపారు. శ్రీసిటీ వెంటిలేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్ రంగంలో ప్రధాన కేంద్రంగా ఎదుగుతోందని, క్యారియర్ పెట్టుబడి దీనికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు .స్థిరమైన, శక్తి-సమర్థ వాణిజ్య శీతలీకరణ పరిష్కారాలకు పెరుగుతున్న డిమాండ్‌ను శ్రీసిటీ ఫ్యాక్టరీ తీర్చడమే కాకుండా, స్థానిక ప్రతిభకు అర్థవంతమైన అవకాశాలను కల్పిస్తుంది. ఈ ప్లాంట్ పచ్చదనం ఆధారిత తయారీ విధానాలను అనుసరించి, గణనీయమైన ఉపాధి అవకాశాలను సృష్టించి, క్యారియర్ సంస్థకు విస్తృత స్థాయిలో తయారీ సామర్థ్యాన్ని అందించి, మార్కెట్ వృద్ధికి తోడ్పడుతుందని సుందరేశన్ నారాయణన్ అన్నారు. డా. రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ, క్యారియర్ పెట్టుబడి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దార్శనిక నాయకత్వంలో రాష్ట్ర పారిశ్రామిక వాతావరణంపై విశ్వాసాన్ని ప్రతిబింబిస్తోందని అన్నారు. ఈ పరిశ్రమ స్థాపనతో ఉపాధి అవకాశాలు పెరిగి, ఆధునిక తయారీ మరియు సుస్థిర ఆవిష్కరణల కేంద్రంగా శ్రీసిటీ మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు .ఈ ఒప్పందానికి ముందు ఇటీవల క్యారియర్ ప్రతినిధులు రాష్ట్ర ముఖ్యమంత్రి మరియు ఐటీ, ఎలక్ట్రానిక్స్ ఉ కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి నారా లోకేష్ లను సంప్రదించి ఉన్నతస్థాయి చర్చలు జరిపారు. చర్చల అనంతరం ఏసీ పరిశ్రమలకు మంచి అనుకూల వాతావరణం కలిగిన శ్రీసిటీలో కార్యకలాపాలు ప్రారంభించేందుకు సంస్థ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో భారతదేశంలో క్యారియర్ సంస్థ ఉనికి మరింత బలపడనుంది. ఇప్పటికే హర్యానాలో ఉన్న తమ తయారీ కేంద్రానికి తోడుగా ఈ కొత్త యూనిట్ పనిచేస్తూ, సంస్థ లక్ష్యాలకు అనుగుణంగా దీర్ఘకాలిక సుస్థిర వృద్ధితో పాటు మార్కెట్‌లో నాయకత్వ స్థానాన్ని మరింత విస్తరించనున్నట్లు క్యారియర్ సంస్థ పేర్కొంది.

# నేషనల్ ఉమెన్ సెల్ వైస్ చైర్మన్ గా షేక్ షబానా



మార్కాపురం జిల్లా ఫిబ్రవరి 17 శ్రీ చక్రమార్కాపురం విజయవాడ అఖిల భారత బీసీ సమాఖ్యకార్యాలయం నందు జరిగిన బడుగు బలహీన వర్గాల పోరాట వేదికకార్యక్రమంలో మార్కాపురం జిల్లాకు చెందిన షేక్ షబానా కు నేషనల్ వుమెన్ సెల్ వైస్ చైర్మన్ గా ఆల్ ఇండియా బీసీ ఫెడరేషన్ నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ సత్యవాడ శ్రీనివాస్ (ఉండి వాసు) నియమించారు. భారతీయ జనతా పార్టీ మైనార్టీ మోర్చాలో ఉన్న షేక్ షబానా మార్కాపురం జిల్లా మరియు పరిసరప్రాంతాలలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ అందరి ఆదరాభిమానాలు పొందడంతో గుర్తించిన అధిష్టానం ఆమెకు ఈ పదవిని ఇవ్వడం ఎంతో అభినందనీయమని పలువురు హర్షం వ్యక్తం చేశారు. నాపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించినందుకు నా వంతు నేనునాబాధ్యతలునిర్వర్తించేందుకు కృషి చేస్తారని షేక్ షబానా అన్నారు. ఆల్ ఇండియా బీసీ ఫెడరేషన్ నేషనల్ ప్రెసిడెంట్గా ఈ బాధ్యతను అప్పగించిన డాక్టర్ సత్యవాడ శ్రీనివాస్ కు షేక్ షబానా కృతజ్ఞతలు తెలిపారు.

## ముగిసిన ఉచిత మెగా మెడికల్ క్యాంపువేలాది శివభక్తులకు వైద్య సేవలుదాతలు,వాలంటీర్లకు కృతజ్ఞతలు తెలిపిన డా. ఏలూరి రామచంద్రారెడ్డి.



మార్కాపురం ఫిబ్రవరి 17 (శ్రీ చక్ర) మార్కాపురం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలం శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి దర్శనార్థం పాదయాత్రగా వెళ్లే శివభక్తుల ఆరోగ్య పరిరక్షణ కోసం లీ ఫార్మా మరియు ఏలూరి లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పెద్ద దోర్నాలలో ఈ నెల 14,15,16 తేదీలలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా మెడికల్ క్యాంపు విజయవంతంగా ముగిసింది. ఈ నెల 14వ తేదీన మార్కాపురం జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీ పీ. శ్రీనివాసులు గారు ప్రారంభించిన ఈ మెడికల్ క్యాంపు మూడు రోజులపాటు నిర్విరామంగా కొనసాగి సోమవారం విజయవంతంగా ముగిసింది. ఈ క్యాంపులో వేలాదిమంది శివభక్తులు వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారు. వైద్యులు భక్తులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన ఉచిత మందులు అందజేసి తగిన వైద్య సూచనలు చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యుడు, బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైలం పాదయాత్రలో పాల్గొనే శివభక్తులకు సేవ చేయడం ఎంతో పవిత్రమైన బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. ఈ సేవా కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన దాతలు, స్వచ్ఛందంగా పాల్గొన్న వాలంటీర్లు, సందర్శించిన అధికారులు, మరియు సేవలను సద్వినియోగం చేసుకున్న శివభక్తులకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా భక్తుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ సమాజ సేవకు ట్రస్ట్ కట్టుబడి ఉంటుందని ఆయన వెల్లడించారు.

## ఏ పి ఎం ఎఫ్ అడహాక్ కమిటి కన్వీనర్ గా బోడిచెర్ల సునీల్ కుమార్ ఎన్నిక



మార్కాపురం ఫిబ్రవరి 17 (శ్రీ చక్ర)మార్కాపురం తిరుపతిలో ఒఖఓఈ ఏపీఎంఎఫ్ ( ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్) బ్రాంచ్ కార్యాలయంలో యూనియన్ వ్యవస్థాపకుడు మరియు ఆంధ్రప్రదేశ్ స్టేట్ అక్రిటేషన్ కమిటీ సభ్యుడు అయిన పి.ఢీల్లీ బాబు రెడ్డి గారు చేతులు మీదుగా మార్కాపురం జిల్లాకు అడహాక్ కమిటీ కన్వీనర్ గా మరియు అక్రిటేషన్ కమిటి నెంబర్ గాఏకగ్రీవంగాఎన్నుకుంటూ బొడిచెర్ల సునీల్ కుమార్ కు నియామక పత్రము అందజేయడం జరిగిందిఅనంతరం మార్కాపురం జిల్లాకు 2026సంవత్సరము డైరీ లు అందజేసిన ఢీల్లీ బాబు రెడ్డిగారుఈ సందర్భంగా బోడిచెర్ల సునీల్ కుమార్ మాట్లాడుతూ నా మీద నమ్మకంతో పెద్ద బాధ్యతను అప్పగించిన మా గురువుగారైన యు పి. ఢిల్లీ బాబు రెడ్డి గారికి నా హృదయపూర్వకంగాధన్యవాదాలు తెలుపుతున్నానుమా సంఘం ఏపీఎంఎఫ్ఒఖఓఈజర్నలిజం విలువలనుకాపాడుతూ జర్నలిస్టుకు అండగాఉంటానని.వృత్తిసంబంధమైన అంశాలపై జర్నలిస్టులకు అవగాహన కల్పిస్తూ జర్నలిస్టుల సమస్యల పరిష్కార సాధన కొరకు ముందువుండి పోరాడుతానని. మా సంఘ నాయకుడు మా గురువుగారైన పి. ఢిల్లీ బాబు రెడ్డి గారి ఆలోచన ఆశయ సాధనలో కచ్చితంగా నిజాయితీగాన డుచుకుంటానని. మా జిల్లాలో మా యూనియన్ సభ్యులకు అండగా ఉంటానని తెలిపారుఅతి త్వరలో జిల్లా కమిటీ ప్రకటించనున్నాను ఎఫ్రిల్ మొదటి వారంలో మార్క్ పురం పట్టణంలో మా నాయకుడు అయినాఢ్లిలీ బాబురెడ్డిరిఅధ్యర్యంలోజిల్లావ ంహాసభనునిర్వహించబడును

## నేడు విద్యుత్ కు అంతరాయం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రత్నాలరావు.

రామచంద్రపురం, ఫిబ్రవరి 17( శ్రీచక్ర)18 వ తేదీ బుధవారం ఉదయం09.00 గంటల నుండి మధ్యాహ్నం 13.00 వరకు పలు ఫీచర్లు పరిధిలో విద్యుత్కు అంతరాయం కలగనుందని రామచంద్రపురం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే.రత్నాలరావు పేర్కొన్నారు. ఈమేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 33/11కేవి ద్రాక్షారామ సబ్ స్టేషన్ యందు 11కేవి ద్రాక్షారామ ఫీడర్,11 కేవి , ఆర్డబ్ల్యూఎస్ ఫీడర్,11కే.వి ఇండస్ట్రియల్ ఫీడర్, 11కేవి, కాపవరం ఫీడర్ 11కేవి తాళ్లపాలెం ఫీడర్ విద్యుత్ మరమ్మతులు మరియు కొరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయబడును అని విద్యుత్తు లేని ప్రాంతంలో ద్రాక్షారామ, అన్నయ్య పేట, తోటపేట, వెంకటాయపాలెం,తాళ్లపాలెం వేగయ్యమ్మ పేట చిన్నంపేట, బాపన్నయ్య చెరువు నలపత్తిపాడు, వెలంపాలెం, ప్రాంతంలో విద్యుత్తు నిలిపివేయబడినని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రత్నాలరావు తెలిపారు.విద్యుత్ వినియోగదారులంతా సహకరించాలని ఈసంధర్బంగా పేర్కొన్నారు.



## ఘనంగా జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమం

మార్కాపురం ఫిబ్రవరి 17( శ్రీ చక్ర)మార్కాపురం శతవసంతాల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, మార్కాపురం. నందు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునగాల చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన.. మార్కాపురం జిల్లా డిఎంహెచ్వో అధికారిణి టి.వాణిశ్రీ ఆధ్వర్యంలో, మార్కాపురం జిల్లా జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు విశిష్ట అతిథిగా డాక్టర్ నరేష్ ముఖ్య పర్యవేక్షణ అధికారిగా జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్నిఘనంగానిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ.. జాతీయ, రాష్ట్రీయ స్థాయిలో 1 నుండి 19 సంవత్సరాల వయస్సు గల బాలబాలికల ఆరోగ్యమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం లో భాగంగా ప్రతి ఒక్క విద్యార్థిఈఆల్బెండజోల్ మాత్రను మింగాలి అని, వ్యక్తిగత పరిశుభ్రత ప్రతి ఒక్క విద్యార్థి పాటించాలని తెలియజేశార ు....తదుపరి ప్రత్యేక పర్యవేక్షణాధికారి డాక్టర్నరేష్మాట్లాడుతూ..నులిపురుగుల నిర్మూలనలో భాగంగా మింగే ఈ ఆల్బెండజోల్ మాత్రల వలన ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని తప్పక ప్రతి ఒక్కరు ఈ మాత్రను తీసుకోవాలని, మన ఆరోగ్య భద్రత మన చేతుల్లోనే ఉందని బయట చిరుతిళ్ళు తినకూడదని, మనం శుభ్రంగా ఉంటూ, చుట్టూ ఉండే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు.అనంతరం మార్కాపురం జిల్లా డి ఎం హెచ్





ఓ టి.వాణిశ్రీ మాట్లాడుతూ ఈ నులిపురుగుల నిర్మూలనలో భాగంగా ప్రతి సంవత్సరం ఆరు నెలలకు ఒకసారి చొప్పున రెండు విడతల్లో ఈ కార్యక్రమంనిర్వహించబడుతుందని, ఈరోజు మార్కాపురం జిల్లా వ్యాప్తంగా రెండు లక్షల 90 వేల మంది విద్యార్థులకు పైగా ఈ మాత్రలు అందజేయడం జరుగుతుందని, ఈరోజు ఈ మాత్రను తీసుకోలేని వారికి మరల 24వతారీఖుపంపిణీచేయబడుతుందనితెలియజేశారు.బల్క్ డ్రగ్ మానిఫాక్చర్ అసోసియేషన్ నేషనల్ జాయింట్ సెక్రటరీ. యస్ ఆర్ ల్యాబరెటరీస్ అధినేత డాక్టర్ ఏలూరిరామచంద్రరెడ్డివ ూట్లాడుతూ... మనం ఆరోగ్యంగా ఉన్నప్పుడే మనం అనుకున్న లక్ష్యాలను సాధించగలమని, పాఠశాలలో మధ్యాహ్నం భోజన సమయంలో మరియు ఇతర సమయాల్లో వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ భోజనానికి ముందు మరియు మల్ల విసర్జన తరువాత చేతులను శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలని తెలియజేశారఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి చంద్రశేఖర్..డాక్టర్ రాహుల్ ..వైద్య సిబ్బంది.. విద్యార్థులు.. పాఠశాల ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది.. పాల్గొనడం జరిగింది.

## విద్యాలకు నులుపురుగు మాత్రలు మింగించిన అధికారులు





రామచంద్రపురం, ఫిబ్రవరి 17( శ్రీచక్ర)నేషనల్ డి వార్మింగ్ డే సందర్భంగా రామచంద్రపురం బాలికల హై స్కూల్ నందు జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ బి .వి. వి సత్యనారాయణ స్కూల్ పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు మ్రింగించారు.వెల్ల గ్రామ హై స్కూల్ నందు గ్రామ సర్పంచ్ వీరబోయిన సూరిబాబు గ్రామ పెద్దలు వీరభద్ర రావు మాత్రలు మ్రింగించారు. ఈసందర్భంగా డాక్టర్ బి వి వి సత్యనారాయణ మాట్లాడుతూ నులిపురుగుల వలన పిల్లలలో రక్తహీనత, ఆకలి ముందగించడం, కడుపునొప్పి వస్తుందని, వీటికి నివారణకు గాను ఈ మాత్రలను అంగన్వాడి సెంటర్లలోనూ స్కూళ్లలోనూ కళాశాలలోనూ 1-19 సంవత్సరముల వయసుగల పిల్లలకు మ్రింగిస్తున్నామని తెలిపారు . రామచంద్రపురం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్లు డి హేమ సుధీర్ , డాక్టర్ శివారెడ్డి , వెల్ల పీహెచ్సీ డాక్టర్ వి స్వాతి భవాని పర్సనల్ హైజిన్ గురించి తెలిపారు. డివిజనల్ సూపర్వైజర్ జి కమల్ శేషు మాట్లాడుతూ ద్రాక్షారామ పిహెచ్సి పరిధిలో 8410 పిల్లలకు గాను 8157 పిల్లలకు మ్రింగించి 96%, వెల్ల పీహెచ్సీ పరిధిలో 2511 పిల్లలకు గాను 2340పిల్లలకు మ్రింగించి 94% నమోదు జరిగిందని, మిగిలిన పిల్లలకు ఈనెల 24వ తారీఖున మాప్అప్ గా అందిస్తామని తెలిపారు. రామచంద్రపురం పట్టణంలో 95% పిల్లలకు మ్రింగించారనిచారని తెలిపారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కోటిపల్లి కుసుమ లక్ష్మి కుమారి గారు, సూపర్వైజర్ లు డి వైకుంఠ రావు, జీ రత్నం, డి రాజేశ్వరి , బి మరియమ్మ మరియు ఏఎన్ఎం లు, హెల్త్ అసిస్టెంట్ లు , ఉపాధ్యాయులు మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## రామచంద్రపురం పట్టణంలో విద్యుత్ కు అంతరాయం.ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రత్నాలరావు.



రామచంద్రపురం, ఫిబ్రవరి 17( శ్రీచక్ర)రామచంద్రపురం పట్టణం నందు 33 /11 కే.వి రామచంద్రపురం సబ్ స్టేషన్ నందు పెయింటింగ్, మరమ్మత్తులు కారణంగా ది 19 వతేది గురువారం విద్యుత్ కు అంతరాయం కలగనుందని డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే.రత్నాలరావు పేర్కొన్నారు. 33 /11 కేవీ రామచంద్రపురం సబ్ స్టేషన్ కు సంబంధించి టౌన్ 1 ఫీడర్, టౌన్ -2, ఫీడర్ టౌన్ 3 ఫీడర్ చెల్లూరు ఫీడర్ మరియు ఓదుర్ ఫీడర్ పరిధిలో ఈ క్రింది ప్రదేశాలలో రామచంద్రపురం ఏరియా హాస్పిటల్, రామకృష్ణ సెంటర్ ,మెయిన్ రోడ్, మార్కెట్ సెంటర్ ,టౌన్ బ్యాంక్ సెంటర్ , విఎస్ఎం కాలేజ్, పసలపూడి రోడ్ చైతన్య రైస్ మిల్ వరకు మరియు హౌసింగ్ బోర్డ్ ముచ్చిమిల్లి ,రత్నంపేట లలిత నగర్ ,కాకినాడ రోడ్ ,కొత్తూరు రోడ్ మణికంఠ రైస్ మిల్ వరకు చోడవరం నూకల మిల్లు ఆరికిరేవుల రోడ్డు నరసరావుపేటలోని ఆక్వాకల్చర్ సర్వీసులకు విద్యుత్ అంతరాయము కలుగునని రత్నాల రావు తెలియజేసినారు విద్యుత్ వినియోగదారులందరూ సహకరించాలని ఆయన కోరారు.

## జెఈఈ సెషన్ -1 ఫలితాల్లో మోడరన్ విజయభేరి

రామచంద్రపురం, ఫిబ్రవరి 17( శ్రీచక్ర)సోమవారం ప్రకటించిన ప్రతిష్టాత్మక జెఈఈ సెషన్ -1 ఫలితాల్లో మోడరన్ జి.ఆర్.సి. జూనియర్ కాలేజీ విద్యార్థులు అత్యుత్తమ పర్సంటైల్ సాధించి జాతీయ స్థాయిలో సత్తా చాటారు. ఈ సందర్భంగా మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జి. వి. రావు మాట్లాడుతూ తమ విద్యార్థి పి.వి. వి. ఎస్. ఎస్. ఎస్. సంజన 97.5 పర్సంటైల్ సాధించి బడ్జెట్ కాలేజీల పరిధిలో డిస్టిక్ టాపర్ గా నిలిచినట్లు పేర్కొన్నారు. అలాగే బి. సాయిశ్రీకర్ 93.71,జి. పూజిత 89.77,ఎ. మనోజ్ 84.28,కె. జిష్ణు 82.67,పి. ఆషిక్ జాషువా 82.85,జి. హర మణికంఠ 81.84,టి. రమ్యశ్రీ 81.69,ఎన్. భీమశంకర్ కౌశిక్ 81.61,ఎం. మౌనిక 81.06,ఎ. వెంకటలక్ష్మి 80.03,ఎ.వి.వి డి.సాయి సుజి 79.95,కె.శశి శ్రీప్రియ 77.58,పి. మేఘన సాయి శ్రీ 77.12,సి. హెచ్. భాగ్యశ్రీ 77.08, కె. హేమసత్య సాయి, 76.35,బి. కీర్తన 76.0,బి. సంధ్య 74.89,ఎం. గీతిక 71.0 పర్సంటైల్ సాధించి జెఈఈ అడ్వాన్స్ కి అర్హత సాధించి, సరికొత్త టౌన్ రికార్డ్ సృష్టించారని పేర్కొన్నారు. సింగిల్ బ్రాంచ్ లోనే తమకు అత్యుత్తమ ఫలితాలు దక్కాయని రావు హర్షం వ్యక్తం చేసారు.గ్రామీణ ప్రాంతాలకు చెందిన తమ విద్యార్థులుజాతీయస్థాయిలో రాణించడం తమకు మరింత స్ఫూర్తి ఇచ్చిందన్నారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ ప్రిన్సిపాల్ సి. హెచ్. రాజేష్ మాట్లాడుతూ పటిష్టమైన ప్రణాళిక, సుదీర్ఘ అనుభవం కలిగిన తమ ఫ్యాకల్టీ ద్వారా ఈ విజయం సాధ్యమైందన్నారు.అనంతరం జెఈఈ టాపర్ సంజన మాట్లాడుతూ తాను టెన్త్ వరకు హాసన్ బాద ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో చదివానని, ప్రస్తుతం మోడరన్ జూనియర్ కాలేజీలో జెఈఈ సెక్షన్ నందు ఇంటర్మీడియట్ చదువుతున్నానని తెలిపింది.మోడరన్ అధినేత డాక్టర్ లయన్ జి.వి రావు ప్రోత్సాహం,కాలేజీలో జెఈఈ స్టాఫ్ అందించిన అత్యుత్తమ బోధన తన విజయానికి కారణమని సంజన స్పష్టం చేసింది.ఈ సందర్భంగా సంజనతో పాటు మిగతా మోడరన్ జెఈఈ ర్యాంకర్లను అధినేత జి. వి.రావు, ప్రిన్సిపాల్ సి. హెచ్. రాజేష్, వైస్ ప్రిన్సిపాల్ పి. ఎస్. ప్రకాష్, అకాడమిక్ అడ్వైజర్ సి. హెచ్. శ్రీనివాస్, జెఈఈ స్టాఫ్ అభినందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఢీ అంటే ఢీ ఏ మోడరన్ జెఈఈ ఛాంపియన్స్ కబడ్డీ కార్యక్రమం అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో అకాడమిక్




డైరెక్టర్స్ ఎ. రమాదేవి, ఆర్.ఉమాదేవి,కె. సాయిరాం చౌదరి,డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పి. వెంకటేశ్వర్లు, హైస్కూల్ హెచ్. ఎం. చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

## పనిభారం తగ్గించాలంటూ కాజులూరులో విఆర్వోలు నిరసన.లంచ్ విరామంలో నల్లబ్యాడ్జీలుతో నిరసన కాజులూరు తాహశీల్దార్ కు వినతిపత్రం




కాజులూరు, ఫిబ్రవరి 17(శ్రీచక్ర) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ సంఘం పిలుపు మేరకు కాజులూరు మండల పరిధిలో విఆర్వోలు లంచ్ టైమ్ లో . నల్ల రిబ్బనులతో తమ నిరసనను వ్యక్తంచేశారు . ఈసందర్భంగా పని వత్తిడి కారణంగా రాష్ట్రంలో ఉన్న పలువురు విఆర్వోలు యాక్సిడెంట్లుకు గురౌతున్నారని, అలాగే ఇంకొందరైతె సూసైడ్ చేసుకుంటున్నారంటూ నిరసన వ్యక్తం చేశారు.పని భారం డోర్ టు డోర్ సర్వేలు ఒక దాని తర్వాత ఒకటి చేసేలా అన్ని సర్వేలు ఒకేసారి చేయమడంవల్ల వీఆర్వోలు మానసికంగా కృంగి పోతున్నవల్ల పేర్కొన్నారు.పని భారం తగ్గించాలని బకాయిలు ఉన్న బిల్లులు వెంటనే చెల్లించాలి నల్ల భ్యాడ్జీలను దరించి తమ నిరసననిని తెలిపారు.అనంతరం కాజులూరు తాహశీల్దార్ జి.ఠాగూర్ కి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కాజులూరు మండల విఆర్వోల అధ్యక్షులు మాచవరపు ఈశ్వరరావు ఆధ్వర్యంలో యూనియన్ సభ్యులు తో కలిసి అందజేశారు.

## పనిభారం తగ్గించాలంటూ కాజులూరులో విఆర్వోలు నిరసన

లంచ్ విరామంలో నల్లబ్యాడ్జీలుతో నిరసన

కాజులూరు తాహశీల్దార్ కు వినతిపత్రం

కాజులూరు, ఫిబ్రవరి 17(శ్రీచక్ర) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ సంఘం పిలుపు మేరకు కాజులూరు మండల పరిధిలో విఆర్వోలు లంచ్ టైమ్ లో . నల్ల రిబ్బనులతో తమ నిరసనను వ్యక్తంచేశారు . ఈసందర్భంగా పని వత్తిడి కారణంగా రాష్ట్రంలో ఉన్న పలువురు విఆర్వోలు యాక్సిడెంట్లుకు గురౌతున్నారని, అలాగే ఇంకొందరైతె సూసైడ్ చేసుకుంటున్నారంటూ నిరసన వ్యక్తం చేశారు.పని భారం డోర్ టు డోర్ సర్వేలు ఒక దాని తర్వాత ఒకటి చేసేలా అన్ని సర్వేలు ఒకేసారి చేయమడంవల్ల వీఆర్వోలు మానసికంగా కృంగి పోతున్నవల్ల పేర్కొన్నారు.పని భారం తగ్గించాలని బకాయిలు ఉన్న బిల్లులు వెంటనే చెల్లించాలి నల్ల భ్యాడ్జీలను దరించి తమ నిరసననిని తెలిపారు.అనంతరం కాజులూరు తాహశీల్దార్ జి.ఠాగూర్ కి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కాజులూరు మండల విఆర్వోల అద్యక్షులు మాచవరపు ఈశ్వరరావు ఆధ్వర్యంలో యూనియన్ సభ్యులు తో కలిసి అందజేశారు.



# మైక్రోస్ట్రెస్ అంటే ఏంటి? ఆరోగ్యాన్ని ఎలా ప్రభావితం చేస్తుంది?



చాలా మంది రోజూ చిన్న చిన్న టెన్షన్లతో జీవిస్తుంటారు. ఇవి పెద్ద సమస్యలు కాకపోయినా.. నిరంతరం ఎదురైతే మన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. ఈ చిన్న చిన్న ఒత్తిడినే మైక్రోస్ట్రెస్ అంటారు.

**మైక్రోస్ట్రెస్ అంటే ఏంటి?**

మైక్రోస్ట్రెస్ అంటే రోజువారీ జీవితంలో ఎదురయ్యే చిన్న చిన్న ఒత్తిడులు. ఉదాహరణకు ఉదయం ఆలస్యంగా లేవడం, ఇల్లు లేదా ఆఫీస్ బాధ్యతలు, చిన్న చిన్న చికాకులు వంటి విషయాలు. ఇవి ఒక్కోసారి పెద్దగా అనిపించకపోయినా.. తరచూ ఎదురైతే మానసికంగా, శారీరకంగా ఒత్తిడిని పెంచుతాయి. ముఖ్యంగా సమయం తక్కువగా ఉండటం, ఎక్కువ అంచనాలు ఉండటం, విశ్రాంతికి సమయం లేకపోవడం వంటి పరిస్థితుల్లో ఇది ఎక్కువగా కనిపిస్తుంది.

**లక్షణాలు ఏంటి?**

మైక్రోస్ట్రెస్ ఒక్కసారిగా కనిపించదు. ఇది క్రమంగా పెరుగుతుంటుంది. దీని వల్ల చిరాకు, విశ్రాంతి లేకపోవడం, దృష్టి కేంద్రీకరించలేకపోవడం, చిన్న విషయాలకు కోపం రావడం, నిద్రలేమి, ఎప్పుడూ బిజీగా ఉన్న భావన వంటి లక్షణాలు కనిపిస్తాయి. వ్యక్తి ఎప్పుడూ తొందరలో ఉన్నట్లు అనిపించినా, అసలు కారణం స్పష్టంగా తెలియకపోవచ్చు.

**ఆరోగ్యంపై ప్రభావం ఎలా ఉంటుంది?**

నిరంతరం మైక్రోస్ట్రెస్ ఉంటే శరీరంలో ఒత్తిడి హార్మోన్లు పెరుగుతాయి. దీని వల్ల రక్తపోటు పెరిగే అవకాశం ఉంటుంది. గుండెపై అదనపు ఒత్తిడి పడుతుంది. రోగనిరోధక శక్తి తగ్గిపోవడం వల్ల తరచుగా జలుబు, ఇన్ఫెక్షన్లు రావచ్చు. జీర్ణవ్యవస్థ కూడా ప్రభావితమై గ్యాస్, ఆమ్లత్వం, కడుపు నొప్పి వంటి సమస్యలు వస్తాయి.



మానసికంగా అలసట, నిరాశ, ఆసక్తి తగ్గిపోవడం వంటి సమస్యలు వస్తాయి. నిద్ర సరిగా లేకపోవడం వల్ల పని సామర్థ్యం కూడా తగ్గుతుంది. దీర్ఘకాలంలో ఇది ఆందోళన, డిప్రెషన్ వంటి తీవ్రమైన సమస్యలకు దారితీసే ప్రమాదం ఉంది.

**ఎవరికి ఎక్కువగా వస్తుంది?**



ఉద్యోగస్తులు, విద్యార్థులు, ఎక్కువ పనులు చేసే వారు, ఎప్పుడూ లక్ష్యాలను చేరుకోవడానికి ప్రయత్నించే వారు ఈ సమస్యకు ఎక్కువగా గురవుతారు. ప్రతి పనిలో పరిపూర్ణత కోరుకునే వారు, ఇతరుల అంచనాలను అందుకోవాలని ఒత్తిడికి గురయ్యే వారు కూడా ప్రమాదంలో ఉంటారు. మొబైల్, సోషల్ మీడియాను ఎక్కువగా ఉపయోగించడం, విశ్రాంతికి సమయం లేకపోవడం కూడా దీనికి కారణం.

**ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి**

రోజూ 7?8 గంటలు నిద్రపోవాలి.
పనిలో మధ్య మధ్యలో విరామం తీసుకోవాలి.
మొబైల్ ఎక్కువగా చూడటం తగ్గించాలి.
సమయాన్ని సరిగ్గా నిర్వహించాలి.
రోజూ తేలికపాటి వ్యాయామం లేదా యోగా చేయాలి.
ముఖ్యమైన పనులకు ప్రాధాన్యత ఇవ్వాలి.
కుటుంబ సభ్యులు, స్నేహితులతో మాట్లాడి మనసు హాయిగా ఉంచుకోవాలి.

మైక్రోస్ట్రెస్ చిన్న సమస్యలా అనిపించినా, దీర్ఘకాలంలో ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపుతుంది. కాబట్టి చిన్న చిన్న ఒత్తిడులను నిర్లక్ష్యం చేయకుండా, సరైన జీవనశైలి అలవాట్లు పాటించడం ద్వారా వాటిని నియంత్రించుకోవచ్చు.




అమెరికా ఈ ప్రపంచానికి ఇచ్చిన ద్రవ్యాల్లో మొక్కజొన్న, మిరపకారం, బొప్పాయి, జామ వంటి పండ్లతో పాటు టమాటా, పొటాటో వంటి శాకాలున్నాయి. వాడైన క్రిస్టోఫర్ కొలంబస్ విజయనగర సామ్రాజ్య వైభవం గురించి విని, స్పెయిన్ రాజుగారి వాణిజ్య ప్రయోజనాల కోసం భారతదేశానికి బయల్దేరి, దారి తప్పి అమెరికా చేరిన తరువాత, స్పెయిన్ వాళ్ళు ఆ ఖండాన్ని గాలించి ఈ ద్రవ్యాలతో పాటు పొగాకుని కూడా కనుగొని, ప్రపంచమంతటికీ వ్యాప్తి చేశారు. కృష్ణదేవరాయలకు సమకాలికుడైన కొలంబస్ ప్రయాణం ప్రపంచ ఆహార చరిత్ర దిశనే మార్చింది.అమెరికాలో ఉల్లిపాయ రంగులో ఉండే 'సస్టాబెర్రీ జామ'ను 17వ శతాబ్దంలో మెక్సికో నుంచి డచ్ వాళ్ళు మొదట మలేసియాకి తెచ్చి సాగు చేయిస్తే, అది లేత పసుపు రంగులో పండింది. మలయాభాషలో దాన్ని 'జంబూ బటూ' అన్నారు. ఆ తరువాత వాళ్ళు పాలకొల్లు వంటి తెలుగు ప్రాంతాల్లో రైతుల ద్వారా సాగుచేయించారు. 'జంబూ బటూ' కాలక్రమంలో తెలుగులో 'జామ'య్యింది.నిమ్మ, నారింజలాంటి పుల్లని పండ్లలోనే సాధారణంగా 'సి' విటమిన్ ఎక్కువగా ఉంటుందని, పుల్లగా ఉంటేనే 'సి' విటమిన్ ఉన్నట్టనీ అనుకుంటాం. కానీ, 100 గ్రాముల జామపండులో సుమారు 80 మి.గ్రా. విటమిన్ 'సి' ఉంటుంది. ఇది నిమ్మకంటే ఎక్కువ. ఎర్రని గుజ్జు ఉండే జామపండులో 'ఏ' విటమిన్ అధికం. సూక్ష్మజీవుల్ని నాశనం చేసే ఫ్లేవ నాయిడ్స్ కూడా జామలో అధికం. పొటాషియం, రాగి, మ్యాంగనీస్ వంటి ఖనిజాలు సమృద్ధిగా ఉంటాయి. తక్కువ క్యాలరీలు కలిగిన జామ, మధుమేహం కలవారు, స్థూలకాయులు తప్పక తినదగినది. యాంటీ ఆక్సిడెంట్స్ ఎక్కువగా ఉండటం వల్ల విషదోషాలు హరించడంలో సాయపడుతుంది.పేగులలోని కండరాలను రిలాక్స్ చేసేగుణం జామకుంది. పీచు పదార్థం (డైటరీ ఫైబర్) ఎక్కువగా ఉండటం వల్ల విరేచనం బాగా జరిగి, కడుపునొప్పి తగ్గుతుంది. రోజూ ఒక కప్పు జామ జ్యూస్ తాగితే పేగులు బలసంప న్నమవుతాయి. విరేచనం సాఫీగా జరుగుతుంది.జామపండు జ్యూస్ తీసి, వాముపొడి కలిపి తాగితే రుచికరంగా ఉండటమే కాక జీర్ణశక్తిని పెంచుతుంది. జామ గుజ్జులో



వాముపొడి కలిపి ఎండించి మురబ్బా తయారు చేస్తారు. ఆకలిని పెంచడంలో, జీర్ణశక్తిని కాపాడటంలో దీనికి మించిన ఔషధం లేదు. జామ్, జెల్లీలు, క్యాండీల తయారీకి జామపళ్ళు అధికంగా తరలిపోవటాన మార్కెట్లో ఇవి ఖరీదైన పండ్లయ్యాయి.ఎనీనీఎ8.2.తీజూణజామపండు ఎంత ప్రముఖమైనదో జామా కులకూ అంత ఔషధ ప్రయోజనాలున్నాయి. జామాకులు శుభ్రం చేసి, ఎండించి, మెత్తగా దంచి ఒక సీసాలో భద్రపరచుకోండి. గ్లాసు నీళ్ళలో చెంచాడు పొడిని కలిపి మరిగించి తాగితే నీళ్ల విరేచనాలు, రక్తవిరేచనాలు వాం తులు, వికారం, గొంతు పుండ్లు, జీర్ణకోశ వ్యాధులు, తల తిరుగుడు (వెర్టిగో) వీటన్నిం టినీ తగ్గిస్తుంది. గ్యాస్ట్రిటిస్, పేగుపూత, నెలసరి సమయంలో వచ్చే కడుపునొప్పి తగ్గుతాయి.పళ్ల నుంచి రక్తం కారటం ఆగుతుంది. జామాకుల పొడితో పళ్లు తోముకోవచ్చు. తమలపాకు, లేత జామాకు కలిపితింటే జీర్ణకోశాన్ని బలపరుస్తుంది. జామాకుల కషాయంతో పుళ్ళు కడుగుతారు. యాంటీ సెప్టిక్ గుణాలున్నాయి వీటికి. కిడ్నీని బలసంపన్నం చేస్తాయి.షుగరు వ్యాధి అదుపులో జామాకుల ప్రయోజనం గురించి విశేషమైన పరిశోధనలు సాగుతున్నాయి. మెదడు వ్యాధులు, రక్తపోటు, రక్తంలో చక్కెర, రక్తస్రావం, గుండె జబ్బులు, దగ్గు జలుబు, ఆయాసాన్ని, కఫాన్ని తగ్గించే గుణం ఉంది కాబట్టి జామాకులను సద్వి నియోగం చేసుకోవాలి. ఒక్కమాటలో చెప్పాలంటే మధుమేహానికి పరంధామ జామ.

# తరచుగా గొంతు నొప్పి.. కారణం ఏమిటో తెలుసా?

గొంతు నొప్పిని చాలామంది చిన్న సమస్యగా తీసుకుంటారు. కానీ ఇది కొన్నిసార్లు ఆరోగ్య సమస్యకు సంకేతం కావచ్చు. గొంతు నొప్పి 3 నుంచి 7 రోజుల్లో తగ్గిపోతుంది. అయితే, తరచుగా వచ్చి ఎక్కువ రోజులు కొనసాగితే దాన్ని నిర్లక్ష్యం చేయకూడదు.

**గొంతు నొప్పికి కారణాలు**

జలుబు, ఫ్లూ వంటి వైరల్ ఇన్ఫెక్షన్లు
బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్లు
అలెర్జీలు
దుమ్ము, పొగ, కాలుష్యం
చాలా చల్లగా లేదా చాలా వేడిగా ఉండే ఆహారం/పానీయాలు
బిగ్గరగా మాట్లాడటం లేదా ఎక్కువగా అరవడం
ధూమపానం

ఆరోగ్య నిపుణుల ప్రకారం గొంతు నొప్పి తీవ్రమైన వ్యాధి కాదు. ఇది ఇన్ఫెక్షన్ లేదా ఇతర సమస్యల లక్షణం కావచ్చు.

**ఈ లక్షణాలు ఉంటే జాగ్రత్తగా ఉండాలి:**

మింగడంలో ఇబ్బంది
జ్వరం
మెడ వాపు
గొంతులో ఎర్రబారడం
నొప్పి ఎక్కువ రోజులు కొనసాగడం

ఇలాంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

**గొంతు నొప్పి నివారణకు చిట్కాలు**



చేతులు శుభ్రంగా ఉంచుకోవాలి.
దుమ్ము, పొగ, కాలుష్యానికి దూరంగా ఉండాలి.
చాలా వేడి లేదా చల్లని పదార్థాలు తినడం తగ్గించాలి.
బిగ్గరగా మాట్లాడడం తగ్గించాలి.
రోజుకు తగినంత నీరు తాగాలి.
పండ్లు, కూరగాయలు, ప్రోటీన్ ఉన్న ఆహారం తీసుకోవాలి.

తరచుగా గొంతు నొప్పి వస్తే దాన్ని చిన్న సమస్యగా తీసుకోకుండా కారణాన్ని గుర్తించి సరైన చికిత్స తీసుకోవడం మంచిది.



# యోగాసనాలతో పూర్తి ఫలం దక్కాలంటే..!

యోగాసనాలతో అవయవ పటుత్వం పెరుగుతుందనే విషయం అందరికీ తెలిసిందే! అయితే యోగాసనాల పూర్తి ఫలం దక్కించుకోవాలంటే యోగాభ్యాస ప్రయోజనాల పట్ల అవగాహన ఏర్పరుచుకోవడం కూడా అవసరమే!

యోగాసనాలతో అవయవ పటుత్వం పెరుగుతుందనే విషయం అందరికీ తెలిసిందే! అయితే యోగాసనాల పూర్తి ఫలం దక్కించుకోవాలంటే యోగాభ్యాస ప్రయోజనాల పట్ల అవగాహన ఏర్పరుచుకోవడం కూడా అవసరమే!

రెండు కాళ్లూ, రెండు చేతులూ నేల మీద ఆనించి ఉంచే ఈ ఆసనంతో పలు ప్రయోజనాలు కలుగుతాయి. అవేంటంటే....

వెన్ను సాగదీయబడుతుంది.
తొడలు, పిక్కలు, పిరుదుల్లోని కండరాలు బలపడతాయి.
మనసు నెమ్మదించి, ఒత్తిడి, ఆందోళన, గందరగోళం, తలనొప్పులు, భుజాల్లో నొప్పులు తగ్గుతాయి.
ఈ ఆసనంతో నాడీ వ్యవస్థ స్వాంతన పొందుతుంది.
మరింత క్లిష్టమైన యోగాసనాలను సాధన చేసేందుకు వీలుగా ఈ ఆసనం శరీరాన్ని సిద్ధం చేస్తుంది.



**అధోముఖ కపోతాసనం**

ఒక కాలును మడిచి, మరో కాలును వెనకగా చాపి కూర్చుని, శరీరాన్ని ముందుకు నేల మీద ఆనించి ఉంచే ఈ ఆసనం వల్ల కలిగే ప్రయోజనాలు ఇవే!

వెనకకు వంగే ఆసనాలు వేయడానికి శరీరాన్ని సిద్ధం చేస్తుంది.
తుంటి, తొడ ఎముకలు కలిసే కీలును బలపరుస్తుంది.
నడిచేటప్పుడు, పద్మాసనం వేసే సమయంలో, పరిగెత్తే సమయంలో, నిలబడినప్పుడు శరీరం మరింత తేలికగా కదిలేలా ఈ ఆసనం తోడ్పడుతుంది.

**విపరీతకారణి**

నేల మీద వెల్లకిలా పడుకుని, గోడ మీద కాళ్లు నిటారుగా చాపి ఉంచే ఈ ఆసనంతో ఒరిగే ప్రయోజనాలు ఇవి...

ఈ ఆసనం వేసే సమయంలో నడుము అడుగున దుప్పటి ఉండలా చుట్టి ఉంచుకుంటే, కాళ్ల వాపులు, అలసిపోయే కీళ్లు, భారంగా మారే తుంటి సమస్యలు తగ్గుతాయి.

విపరీతకారిణి ఆసనం వేయడం వల్ల ఇలాంటి ఇబ్బందులకు కారణమయ్యే లింఫ్, ఇతర స్రావాలు ఆయా శరీర భాగాల నుంచి పొత్తికడుపులోకి చేరతాయి. ఫలితంగా కాళ్లు, పునరుత్పత్తి వ్యవస్థల్లోని ఇబ్బందులు తొలగుతాయి.

# ఇలా చేస్తే ఆరోగ్య సమస్యల నుంచి బయటపడొచ్చు!



ఎనిమిది గంటలైనా కుర్చీలో కూర్చుని కంప్యూటర్‌పై పనిచేస్తూ ఉంటారు. ఇలా ఎక్కువ సేపు కూర్చోవటం వల్ల రకరకాల ఆరోగ్య సమస్యలు వస్తూ ఉంటాయి. ఈ సమస్యలు రాకుండా ఆఫీసులో కూర్చుని చేసే 'యోగా' ఇప్పుడిప్పుడే ప్రాచుర్యంలోకి వస్తోంది. అలాంటి యోగాసనాలేమిటో ఏమిటో చూద్దాం...

**విశ్రాంతి కోసం..**

ఎక్కువ సేపు కుర్చీలో కూర్చుని పనిచేస్తే ఒక విధమైన అలసట వస్తుంది. ఇది తొలగిపోవటానికి కుర్చీలో కూర్చునే విశ్రాంతి తీసుకొనే ఆసనం ఒకటుంది. కుర్చీలో నడుమును నిటారుగా ఉంచి...అరిచేతులను తొడలపై ఉంచాలి. మూడు నిమిషాలు కళ్లు మూసుకొని దీర్ఘశ్వాసలు తీసుకోవాలి. ఇలా రోజుకు కనీసం రెండు సార్లు చేస్తే అలసట తొలగిపోతుంది.

**నడుము నొప్పి పోవాలంటే..**

నడుము నెప్పి పోవాలంటే ముందు ఉన్న డెస్క్‌పై చేతులు ఉంచాలి. తల పైకెత్తి నడుమును ముందుకు వంచాలి. పది సెకన్ల తర్వాత నడమును లోపలికి వంచి తలను డెస్క్ వైపు వచ్చేలా వంచాలి. ఇలా పది సార్లు చేస్తే నడుము నెప్పికి కొంత ఉపశమనం లభిస్తుంది.

**అరచేయి.. మోచేతి నొప్పులు పోవాలంటే**

పిడికిలి బిగించి చేతిని ముందుకు చాపాలి. పిడికిలిని గుండ్రంగా ఎడమవైపునకు.. ఆ తర్వాత కుడివైపునకు తిప్పాలి. ఇలా పది సార్లు చేసిన తర్వాత రెండు చేతులను ముందుకు చాపి అరిచేతి భాగం ముందకు వచ్చేలా వేళ్లను లాక్ చేయాలి. ఇలా చేతులను ముందుకు.. వెనక్కు కదపాలి. ఇలా పది సార్లు చేయాలి. ఈ రెండు ఎక్సర్‌సైజ్‌ల వల్ల చేతుల నెప్పులు తగ్గుతాయి.

**తొడ కండరాల కోసం..**

ఎక్కువ సేపు కుర్చీలో కదలకుండా కూర్చుంటే తొడ కండరాలు బిగిసుకుపోతాయి. ఈ ఇబ్బందిని తొలగించటానికి? కుర్చీలో నిటారుగా కూర్చుని.. ఎడమ కాలి మడమను కుడి కాలి తొడపై పెట్టాలి. ఆ తర్వాత కళ్లు మూసుకొని 7 నుంచి 10 సార్లు దీర్ఘశ్వాసను తీసుకోవాలి. ఇలా చేస్తే తొడ కండరాలపై ఒత్తిడి తొలగిపోతుంది.



# స్పోర్ట్స్ న్యూస్

## మరోసారి గొడవపడిన కుల్దీప్, సూరీడు!

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా పాకిస్థాన్‌తో విజయానంతరం టీమిండియా స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ కోపంగా కనిపించడం తీవ్ర చర్చనీయాంశమైంది. హార్దిక్ పాండ్యా బౌలింగ్‌లో ఈజీ క్యాచ్ వదిలేసినందుకు అతనితో పాటు కెప్టెన్ సూర్య ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈజీ క్యాచ్ పట్టకపోతే ఎలా అంటూ మందలించాడు.ఈ విజయానంతరం ఆటగాళ్లు పరస్పరం అభినందనలు తెలుపుకొనే సమయంలో సూర్య చేయి కలపబోగా.. కుల్దీప్ యాదవ్ పట్టించుకోకుండా వెళ్లిపోయాడు. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. సూర్యకుమార్ యాదవ్, కుల్దీప్ యాదవ్ మధ్య విభేదాలు ఉన్నట్లు వార్తలు వచ్చాయి.మున్ముందు జట్టులోని ఆటగాళ్ల మధ్య సంబంధాలు ఎలా ఉంటాయో అని భారత అభిమానులు




కంగారు పడ్డారు. అయితే ఈ వార్తలకు సూర్యకుమార్ యాదవ్ తనదైన శైలిలో ఫుల్ స్టాప్ పెట్టాడు. మ్యాచ్‌లో జరిగిన విషయాలను మరిచిపోయి ఇద్దరూ కలిసిపోయామని అభిమానులకు తెలియజేశాడు.పాకిస్థాన్‌తో మ్యాచ్ అనంతరం తమ మధ్య చోటు చేసుకున్న ఘటనను సూర్య, కుల్దీప్ యాదవ్ ఫన్నీగా రీక్రియేట్ చేశారు. ఈ రీల్‌ను సూర్య సోషల్ మీడియా వేదికగా పంచుకున్నాడు. ఈ వీడియోకు 'కోపం తగ్గించుకో భాయ్'అని క్యాప్షన్‌ను పేర్కొన్నాడు. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట వైరల్‌గా మారింది.పాకిస్థాన్ ఇన్నింగ్స్ సందర్భంగా హార్దిక్ పాండ్యా వేసిన 18వ ఓవర్‌లో షాహిన్ అఫ్రిది ఇచ్చిన రెండు క్యాచ్‌లను ఇషాన్ కిషన్, కుల్దీప్ యాదవ్ వరుసగా వదిలేసారు. ఈ ఓవర్ తొలి బంతి షాహిన్ అఫ్రిది గ్లోవ్స్ తాకుతూ కీపర్ వైపు వెళ్లగా ఇషాన్ అందుకోలేకపోయాడు. ఆ మరుసటి బంతినే షాహిన్ అఫ్రిది భారీ షాట్ ఆడగా.. లాంగాన్‌లో ఫీల్డింగ్ చేస్తున్న కుల్దీప్ యాదవ్ చేతిలో నుంచి జారి బౌండరీ బయట పడింది. క్యాచ్ వదిలేయడంతో పాటు కుల్దీప్ సిక్సర్‌ను కూడా అడ్డుకోలేకపోయాడు. దాంతో తీవ్ర అసహనానికి గురైన హార్దిక్ పాండ్యా.. ముందు వాడు.. ఇప్పుడు నువ్వు.. ఏడ మోపైర్రా నాకు అని అసహనం వ్యక్తం చేశాడు.ఈ మ్యాచ్ అనంతరం కుల్దీప్ యాదవ్‌ను హార్దిక్ పాండ్యాతో పాటు సూర్యకుమార్ యాదవ్ మందలించాడు. ఈజీ క్యాచ్ పట్టకపోతే ఎలా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సాధారణంగా కుల్దీప్ యాదవ్ లాంగాన్‌లో ఫీల్డింగ్ చేయడు. కానీ అప్పటికే భారత విజయం లాంఛనం కావడంతో ప్రాక్టీస్ కోసం అతన్ని లాంగాన్‌లో ఉంచారు. కానీ అతను సునాయస క్యాచ్‌ను నేలపాలు చేయడంతో పాటు సిక్సర్‌ను అడ్డుకోలేకపోయాడు. భారత్ విజయం ఖాయమైంది కాబట్టి ఎలాంటి నష్టం జరగ లేదు. కానీ కీలక మ్యాచ్‌ల్లో ఇలాంటి ఈజీ క్యాచ్‌లు వదిలేస్తే ఎలా? అని సూర్య ఆందోళన వ్యక్తం చేశాడు. కుల్దీప్ యాదవ్ ఫీల్డింగ్‌లో వీక్ అనే సంగతి తెలిసిందే. ఈ కారణంతోనే గతంలో రోహిత్ శర్మ చేతిలో కూడా అతను తిట్లు తిన్నాడు.

## భారత్-పాక్ మధ్య మరో బిగ్ ఫైట్?

కొలంబో వేదికగా జరిగిన హై-వోల్టేజ్ పోరులో పాకిస్థాన్‌ను 61 పరుగుల తేడాతో భారత్ చిత్తు చేసిన విషయం తెలిసిందే. ఈ గెలుపుతో సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీలోని టీమిండియా గర్వంగా సూపర్-8లోకి అడుగుపెట్టింది. అయితే దాయాదుల మధ్య పోరు ఎప్పుడూ అభిమానులకు కన్నులపండుగే. అందుకే ఈ ప్రపంచ కప్‌లో భారత్, పాక్ జట్లు మళ్లీ ఎప్పుడు తలపడతాయి? అసలు ఆ అవకాశం ఉందా? అనే చర్చ ప్రస్తుతం క్రికెట్ వర్గాల్లో జోరుగా సాగుతోంది. ఐసీసీ నిబంధనలు, ప్రస్తుత పాయింట్ల పట్టికను బట్టి చూస్తే ఈ మ్యాచ్ జరగడానికి కొన్ని సంక్లిష్టమైన సమీకరణాలు ఉన్నాయి.మొదటిగా గమనించాల్సిన విషయం ఏమిటంటే.. సూపర్-8 దశలో భారత్, పాకిస్థాన్ జట్లు తలపడే అవకాశం లేదు. ఐసీసీ ప్రవేశపెట్టిన 'ప్రీ-సీడింగ్' విధానం ప్రకారం ఈ రెండు జట్లు వేర్వేరు గ్రూపుల్లో ఉన్నాయి. భారత్(డీ1) గ్రూప్-1లో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్‌లతో కలిసి ఉండగా.. పాకిస్థాన్(జ3) గ్రూప్-2లో ఇంగ్లాండ్, న్యూజిలాండ్, శ్రీలంకలతో పోటీ పడుతోంది. సూపర్-8లో ప్రతి జట్టు తమ గ్రూప్‌లోని జట్లతోనే ఆడుతుంది కాబట్టి ఇక్కడ భారత్-పాక్ మ్యాచ్ జరిగే ఛాన్సే లేదు.భారత్-పాక్ జట్లు ఈ టోర్నీలో మళ్లీ తలపడాలంటే అది కేవలం సెమీఫైనల్ లేదా ఫైనల్ దశలోనే సాధ్యమవుతుంది.




సూపర్-8లోని రెండు గ్రూపుల నుంచి టాప్-2లో నిలిచిన జట్లు సెమీఫైనల్స్‌కు చేరుకుంటాయి. ఒకవేళ భారత్ గ్రూప్-1లో టాపర్‌గా నిలిచి.. పాకిస్థాన్ తన గ్రూప్-2లో రెండో స్థానంలో నిలిస్తే.. అలా కాకుండా భారత్ గ్రూప-1లో రెండో స్థానంలో నిలిచి.. పాకిస్థాన్ గ్రూప్-2లో మొదటి స్థాననంలో నిలిస్తే.. మార్చి 4 లేదా 5న జరిగే సెమీఫైనల్‌లో ఈ దాయాది జట్లు ఢీకొనే అవకాశం ఉంది. ఇది జరగాలంటే పాకిస్థాన్ తన తదుపరి మ్యాచ్‌లలో అద్భుత ప్రదర్శన చేయాల్సి ఉంటుంది.అభిమానుల అసలు కోరిక ఏమిటంటే.. 2007 టీ20 ప్రపంచ కప్ లాగా భారత్-పాకిస్థాన్ జట్లు ఫైనల్లో తలపడాలి. ఇది జరగాలంటే రెండు జట్లు సెమీఫైనల్స్ దాటి తుది పోరుకు అర్హత సాధించాలి. ప్రస్తుతం భారత్ ఉన్న ఫామ్ చూస్తుంటే సెమీస్ చేరడం ఖాయంగా కనిపిస్తోంది. కానీ పాకిస్థాన్ పరిస్థితి మాత్రం కొంత గందరగోళంగా ఉంది. వారు ముందుగా సూపర్-8కు క్వాలిఫై అవ్వాలి, ఆపై అక్కడ ఇంగ్లాండ్, న్యూజిలాండ్ వంటి జట్లను దాటుకుని సెమీస్ చేరాలి. ఒకవేళ అంతా కలిసొస్తే, దశాబ్దన్నర కాలం తర్వాత మళ్లీ మనం వరల్డ్ కప్ ఫైనల్లో భారత్-పాక్ యుద్ధాన్ని చూడవచ్చు.ఇప్పటికే సూపర్-8లో భారత్ ఆడబోయే మ్యాచ్‌ల తేదీలు ఖరారయ్యాయి. ఫిబ్రవరి 22న అహ్మదాబాద్‌లో దక్షిణాఫ్రికాతో, ఫిబ్రవరి 26న చెన్నైలో ఆస్ట్రేలియాతో, మార్చి 1న కోల్‌కతాలో వెస్టిండీస్‌తో భారత్ తలపడనుంది. ఈ మూడు మ్యాచ్‌లలో భారత్ తన ఆధిపత్యాన్ని చాటుకుంటే సెమీస్ బెర్తు ఖాయమవుతుంది. మరోవైపు పాకిస్థాన్ గనుక ఫిబ్రవరి 18న నమీబియాపై గెలిస్తేనే వారి ఆశలు సజీవంగా ఉంటాయి. మొత్తానికి అభిమానులు మాత్రం 'మరోసారి ఇండియా వర్సెస్ పాకిస్థాన్' అని నినదిస్తున్నారు.

## టీ20 ఐసీసీ ర్యాంకింగ్స్: దీప్తి శర్మను వెనక్కి నెట్టి.. అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్న పాకిస్థాన్ బౌలర్

పాకిస్థాన్ స్టార్ స్పిన్నర్ సాదియా ఇక్బాల్ ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో సత్తా చాటింది. టీమిండియా స్టార్ క్రికెటర్ దీప్తి శర్మను వెనక్కి నెట్టి ప్రపంచ నంబర్ వన్ బౌలర్‌గా తిరిగి తన స్థానాన్ని సంపాదించుకుంది. తాజాగా ఐసీసీ విడుదల చేసిన మహిళా ప్లేయర్ల ర్యాంకింగ్స్‌లో సాదియా రెండు స్థానాలు ఎగబాకి అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది.ఇటీవల దక్షిణాఫ్రికాతో జరిగిన మూడు టీ20ల సిరీస్‌లో సాదియా అద్భుత ప్రదర్శనతో చెలరేగింది. మొత్తంగా ఐదు వికెట్లు తీసి సిరీస్‌లో అత్యధిక వికెట్లు సాధించిన బౌలర్‌గా నిలిచింది. ముఖ్యంగా బెనోనిలో జరిగిన ఆఖరి మ్యాచ్‌లో కేవలం 18 పరుగులు ఇచ్చి 3 వికెట్లు తీసుకొని ఐసీసీ ర్యాంకింగ్స్‌లో భారీ జంప్ సాధించింది. గతేడాది చివర్లో కూడా సాదియా నంబర్ వన్ స్థానాన్ని అందుకుంది.ఇదిలా ఉంటే పాక్ కెప్టెన్ ఫాతిమా సనా కూడా ఐసీసీ ర్యాంకింగ్స్‌లో సత్తా చాటింది. టీ20 బ్యాటర్ల జాబితాలో 31 స్థానాలు ఎగబాకి 28వ స్థానంలో నిలిచింది. అలాగే టీ20 ఆల్‌రౌండర్లలో ఐదు స్థానాలు మెరుగుపరుచుకుని ఆరో స్థానానికి చేరింది. సౌతాఫ్రికాతో సిరీస్ డిసైడర్ మ్యాచ్‌లో 30 బంతుల్లో అజేయ 47 పరుగులు చేసి, రెండు కీలక వికెట్లు తీసి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకుంది.ఆస్ట్రేలియాతో సిడ్నీలో జరిగిన తొలి టీ20 మ్యాచ్ అనంతరం భారత బౌలర్ల ర్యాంకింగ్స్‌లోనూ మార్పులు చోటు చేసుకున్నాయి. రేణుకా సింగ్ ఆరు స్థానాలు ఎగబాకి ఐదో స్థానంలో నిలిచింది. ఆసీస్‌పై ఒకే మ్యాచ్‌లో ఏకంగా 4 వికెట్లు తీసిన అరుంధతీ రెడ్డి 19 స్థానాలు ఎగబాకి 16వ స్థానంలో నిలిచింది. శ్రీచరణి కూడా ఎనిమిది స్థానాలు మెరుగుపరుచుకుని 39వ స్థానానికి చేరింది.




## కెనడాపై 8 వికెట్ల తేడాతో విక్టరీ.. సూపర్-8లోకి న్యూజిలాండ్ ఎంట్రీ




చెన్నై: టీ20 వరల్డ్‌కప్‌లో ఇవాళ కెనడాతో జరిగిన మ్యాచ్‌లో న్యూజిలాండ్ 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. కివీస్ బ్యాటర్లు రచిన్ రవీంద్ర, గ్లెన్ ఫిలిప్స్ అర్ధ శతకాలు బాదారు. చెన్నైలో జరిగిన గ్రూప్ డీ మ్యాచ్‌లో తొలుత కెనడా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్నది. భారతీయ సంతతికి చెందిన కెనడా బ్యాటర్ యువరాజ్ సమ్రా తన బ్యాటింగ్‌తో హోరెత్తించాడు. 65 బంతుల్లోనే 110 రన్స్ స్కోరు చేశాడు. అతని ఇన్నింగ్స్‌లో 11 బౌండరీలు, ఆరు సిక్సర్లు ఉన్నాయి. యువరాజ్ సమ్రా దూకుడు వల్ కెనడా నిర్ణీత ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 173 రన్స్ చేసింది. సమ్రా, బజ్వా మధ్య తొలి వికెట్‌కు 116 పరుగులు భాగస్వామ్యం ఏర్పడింది.భారీ టార్గెట్‌ను న్యూజిలాండ్ ఈజీగా ఛేజ్ చేసింది. కేవలం 15.1 ఓవర్లలోనే లక్ష్యాన్ని అందుకున్నది. రవీంద్ర 39 బంతుల్లో 59 రన్స్, ఫిలిప్స్ 36 బంతుల్లో 77 రన్స్ చేశారు. మూడో వికెట్‌కు అజేయంగా ఆ ఇద్దరూ 146 రన్స్ జోడించారు. ఈ గెలుపుతో కివీస్ వరల్డ్‌కప్ సూపర్ 8 స్టేజ్‌లోకి వెళ్లిపోయింది.

## ఇమ్రాన్ ఖాన్‌కు వైద్యం అందించండి.. పాక్ ప్రభుత్వానికి కపిల్ దేవ్, సునీల్ గవాస్కర్ వినతి

మాజీ క్రికెటర్, పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు మద్దతుగా ఇండియా సహా ప్రపంచవ్యాప్తంగా ఉన్న పలువురు వెటరన్ క్రికెటర్లు స్పందించారు. జైలులో అనారోగ్యంతో ఉన్న ఇమ్రాన్‌కు మానవతా దృక్పథంతో తగిన చికిత్స అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఇండియా నుంచి లెజెండరీ క్రికెటర్లు కపిల్ దేవ్, సునీల్ గవాస్కర్ ఒక ప్రకటన చేశారు. ఇమ్రాన్ ఖాన్ మూడేళ్లుగా పాక్‌లోని జైలులో ఖైదీగా ఉన్నారు. ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.అయితే, ఆయనకు పాక్ ప్రభుత్వం సరైన వైద్యం అందించడం లేదని



ఇమ్రాన్ మద్దతుదారులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇమ్రాన్‌కు మానవతా కోణంలో సరైన వైద్యం అందించాలని 14 మందితో కూడిన క్రికెట్ మాజీ కెప్టెన్ల బృందం కోరింది. దీనిపై పాక్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఇందులో ఇండియా నుంచి కపిల్ దేవ్, సునీల్ గవాస్కర్‌తోపాటు ఆస్ట్రేలియన్ గ్రేట్ గ్రెగ్ చాపెల్, మైఖేల్ అథర్టన్, స్టీఫెన్ వా, జాన్ రైట్, అలన్ బోర్డర్, క్లైవ్ లాయిడ్, మైఖేల్ బ్రేర్‌లీ, నాజిర్ హుస్సేన్, ఇయాన్ చాపెల్, కిమ్ హ్యూస్, డేవిడ్ గ్రోవర్, బెలిందా క్లాక్ సంతకాలు చేసిన ఒక ప్రకటన తాజాగా మీడియాకు విడుదల చేశారు. క్రీడాస్ఫూర్తితోనే క్రికెటర్‌గా ఇమ్రాన్‌కు మద్దతు తెలుపుతున్నట్లు వారు ప్రకటనలో పేర్కొన్నారు.ఇమ్రాన్‌కు సంబంధించి ఎలాంటి చట్టపరమైన అంశాలకు భంగం కలగకుండా చికిత్స అందించాలని కోరారు. అతడికి పూర్తి భద్రత కల్పించాలని, న్యాయ సహాయం అందించాలని, కుటుంబ సభ్యుల్ని కలుసుకునేందుకు అనుమతించాలని కూడా లేఖలో డిమాండ్ చేశారు. తక్షణమే వైద్య సహాయం అందించే ఏర్పాట్లు చేయాలన్నారు. ఇమ్రాన్ ఖాన్.. పాకిస్తాన్ క్రికెట్‌కు విశేష సేవలందించారు. పాక్ గెలిచిన ఏకైక వరల్డ్ కప్ (1992) ఆయన కెప్టెన్సీలోనే. అందుకే క్రికెట్ వరల్డ్‌లో ఆయనకు మంచి గుర్తింపు ఉంది. ఈ నేపథ్యంలోనే క్రికెట్ ప్రముఖులు ఆయనకు మద్దతుగా ప్రకటన విడుదల చేశారు.

## యువరాజ్ సమ్రా వరల్డ్ రికార్డ్.. వరల్డ్‌కప్‌లో సెంచరీ కొట్టిన 19 ఏళ్ల కెనడా బ్యాటర్

చెన్నై: టీ20 వరల్డ్‌కప్‌లో కెనడా బ్యాటర్ సెంచరీ కొట్టాడు. 19 ఏళ్ల ఆ బ్యాటర్ న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 65 బంతుల్లో 110 రన్స్ చేసి ఔటయ్యాడు. అతని ఇన్నింగ్స్‌లో 11 ఫోర్లు, ఆరు సిక్సర్లు ఉన్నాయి. టాస్ గెలిచిన ఫస్ట్ బ్యాటింగ్ చేసిన కెనడా నిర్ణీత



ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 173 రన్స్ చేసింది. ఈ మ్యాచ్‌లో యువరాజ్ సమ్రా కేవలం 58 బంతుల్లో సెంచరీ నమోదు చేశాడు. ఐసీసీ టీ20 వరల్డ్‌కప్‌లో సెంచరీ కొట్టిన యంగెస్ట్ బ్యాటర్‌గా నిలిచాడతను. భారత మాజీ బ్యాటర్ యువరాజ్ సింగ్ స్ఫూర్తితో సమ్రాకు అతని తండ్రి ఆ పేరు పెట్టాడు.ఈ యువ క్రికెటర్ ఇటీవల కొన్ని మ్యాచుల్లో జోరుగా బ్యాటింగ్ చేశాడు. వరల్డ్‌కప్‌కు ముందు గత ఏడాది జరిగిన ఓ టోర్నీల్లో యువరాజ్ సమ్రా 15 బంతుల్లోనే బహమాస్‌పై హాఫ్ సెంచరీ నమోదు చేశాడు. అయితే ఇవాళ న్యూజిలాండ్ లాంటి పెద్ద జట్టుపై సమ్రా సెంచరీ కొట్టడం అతని ట్యాలెంట్‌ను బయటపెట్టింది. కట్టుదిట్టమైన బౌలింగ్ వేసే కివీస్ బౌలర్లలను అతను ఊచకోత కోశాడు. తొలుత 36 బంతుల్లో సమ్రా తన హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు.అతిపిన్న వయసులో టీ20 వరల్డ్‌కప్‌లో సెంచరీ కొట్టిన రికార్డు గతంలో పాక్ క్రికెటర్ అహ్మద్ షెహజాద్ పేరిట ఉన్నది. అతను 22 ఏళ్ల వయసులో సెంచరీ చేశాడు.

## 10వ తరగతి పరీక్షలకు వైభవ్ సూర్యవంశీ డుమ్మా!

న్యూఢిల్లీ: సంచలన యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ( ఈ ఏడాది పదో తరగతి బోర్డు పరీక్షలు మిస్ కానున్నాడు. అతను ఆ పరీక్షలు ఈ ఏడాది రాయడం లేదని తెలిసింది. తాజాగా ముగిసిన అండర్19 వరల్డ్‌కప్‌లో దుమ్మురేపిన



వైభవ్.. ప్రస్తుతం రాబోయే ఐపీఎల్ కోసం శిక్షణ తీసుకుంటున్నాడు. దీంతో అతను పదో తరగతి బోర్డు పరీక్షలను డుమ్మా కొట్టనున్నాడు. 14 ఏళ్ల సూర్యవంశీ బీహార్‌లోని తాజ్‌పుర్‌లో ఉన్న మోడెస్టీ స్కూల్‌లో చదువుతున్నాడు. అయితే బీహార్‌లో పదో తరగతి బోర్డు ఎగ్జామ్స్ ఫిబ్రవరి 17వ తేదీ నుంచి మార్చి 11వ తేదీ వరకు నిర్వహించనున్నారు.గత ఏడాది మొత్తం అండర్19, ఇండియా-ఏ తరపు బిజీ క్రికెట్ ఆడిన వైభవ్.. బోర్డు పరీక్షలకు పెద్దగా ప్రిపేర్ కాలేదు. సూర్యవంశీ కోచ్ మనిష్ ఓజా ఈ విషయాన్ని కన్ఫర్మ్ చేశాడు. ఐపీఎల్ కోసం ప్రిపేరవుతున్న వైభవ్ .. ఆ టోర్నీలో రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడనున్నాడు. ప్రస్తుతం నాగపూర్‌లో జరుగుతున్న ట్రైనింగ్ క్యాంపులో అతను శిక్షణ పొందుతున్నాడు. అండర్ 19 వరల్డ్‌కప్ ఫైనల్లో సూర్యవంశీ సూపర్ సెంచరీ కొట్టిన విషయం తెలిసిందే.ఇంగ్లండ్‌తో జరిగిన ఫైనల్లో అతను 80 బంతుల్లో 175 రన్స్ చేశాడు. ఇక ఆ టోర్నీలో ఏడు మ్యాచుల్లో వైభవ్ 439 రన్స్ చేశాడు. 62.71 సగటు.. 170 స్ట్రయిక్ రేట్‌తో అతను బ్యాటింగ్ చేశాడు.



# సినిమా



## వారణాసి.. 25 నిమిషాల కోసం రూ.300 కోట్లా?



సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శకధీరుడు ఎస్.ఎస్ రాజమౌళి కలయికలో తెరకెక్కుతున్న వారణాసి ఇప్పటికే భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత భారీ ప్రాజెక్టులలో ఒకటిగా చర్చనీయాంశమైంది. అయితే ఈ సినిమా బడ్జెట్ గురించి వినిపిస్తున్న తాజా సమాచారం పరిశ్రమ వర్గాల్లో మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ముఖ్యంగా సినిమాలోని త్రేతాయుగ ఎపిసోడ్‌కే రూ.250 నుంచి రూ.300 కోట్ల మధ్య ఖర్చవుతుందన్న వార్తలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి విజువల్ ఎఫెక్ట్స్ కు భారీ ఖర్చు సాధారణంగా భారీ బడ్జెట్ సినిమాలంటే స్టార్ రెమ్యునరేషన్స్ లేదా విదేశీ లొకేషన్లు అనుకోవడం కామన్. కానీ ఈ సినిమాలో ఎక్కువ ఖర్చు విజువల్ వండర్స్ ను తీర్చిదిద్దడానికే అవుతోందని తెలుస్తోంది. త్రేతాయుగాన్ని నేటి ప్రేక్షకుల ముందు నమ్మదగిన రీతిలో ప్రతిష్ఠించాలంటే సెట్లు, ఆర్ట్ డిజైన్, వీఎఫ్ఎక్స్, యాక్షన్ కొరియోగ్రఫీ, కాస్ట్యూమ్స్ అన్నీ అత్యున్నత ప్రమాణాల్లో ఉండాల్సిందే. పురాణాల్లో చదివిన అయోధ్య, అరణ్యాలు, యుద్ధరంగాలు, దివ్యాస్త్రాలు తెరపై కృత్రిమంగా కనిపిస్తే ప్రేక్షక అనుభూతి దెబ్బతింటుంది. అందుకే రాజమౌళి ప్రతి ఫ్రేమ్‌నీ అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారని తెలుస్తోంది. సరికొత్త ఫీచర్స్ తో ఏఎంబి సినిమాస్ వారణాసి కోసం అడ్వాన్స్డ్ టెక్నాలజీ అందులో వీఎఫ్ఎక్స్ ఖర్చులే ఈ ఎపిసోడ్‌లో ఎక్కువ బడ్జెట్ ను తీసుకుంటున్నాయని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఒక హై క్వాలిటీ షాట్‌కే లక్షలు లేదా కోట్లు ఖర్చవుతుండగా, ఇరవై ఐదు నిమిషాల నిడివిలో వేలాది కంప్యూటర్ జనరేటెడ్ షాట్లు అవసరమైతే ఖర్చు ఎంత పెరుగుతుందో అంచనా వేయొచ్చు. భారీ యుద్ధ సన్నివేశాల కోసం మోషన్ క్యాప్చర్ టెక్నాలజీ, క్రౌడ్ సిమ్యులేషన్ సాఫ్ట్‌వేర్, ఇంటర్నేషనల్ వీఎఫ్ఎక్స్ స్టూడియోల ను దీని కోసం వినియోగించే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. రీసెర్చ్ కోసం అదనపు ఖర్చు ఇవి మాత్రమే కాకుండా అదనంగా, యాక్షన్ బ్లాక్స్ కోసం స్పెషల్ గా డిజైన్ చేసిన సెట్లు, వైర్ వర్క్, స్టంట్ టీమ్స్, అలాగే ఎమోషన్ ను నెక్స్ట్ లెవెల్ కు తీసుకెళ్లే లైవ్ ఆర్కెస్ట్రా బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కూడా బడ్జెట్ ను పెంచుతున్నాయి. పురాణ కథనాల్లో సహజత్వం అత్యంత కీలకం కావడంతో జ్యుయలరీ, వెపన్స్, కాస్ట్యూమ్స్, ఆఖరి బాడీ లాంగ్వేజ్ విషయంలో కూడా ఎంతో రీసెర్చ్ అవసరం కావడంతో, ఈ రీసెర్చ్ మరియు డీటైలింగ్ ప్రాసెస్ వల్ల ప్రొడక్షన్ డిజైన్ ఖర్చు కూడా పెరిగే అవకాశముంది. బాహుబలిని మించేలా ప్లానింగ్ రాజమౌళి గత సినిమాల విజువల్ వండర్స్ ను గుర్తు చేస్తూ ఈ ఎపిసోడ్‌ను బాహుబలి కంటే మరింత భారీ స్థాయిలో మలచాలని జక్కన్న చేస్తున్న ప్రయత్నంగా విశ్లేషిస్తున్నారు. అయితే ఇది కేవలం విజువల్స్ కోసం చేసే ఖర్చు మాత్రమే, కథలోని ఎమోషనల్ డెప్త్ ను ఆడియన్స్ కు నేరుగా చేర్చే ప్రయత్నమని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



## అందాలతో ఆకట్టుకుంటున్న ఆయేషా ఖాన్..



బిగ్ బాస్ 17 ఫేమ్ ఆయేషా ఖాన్ ప్రస్తుతం సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. ముఖ్యంగా తన లేటెస్ట్ ఫోటోషూట్‌లతో కుర్రకారు గుండెల్లో మంటలు పుట్టిస్తోంది. మీరు అడిగిన ఇన్‌స్టాగ్రామ్ లింక్‌లో ఆమె ఒక అద్భుతమైన గ్లామరస్ లుక్‌లో మెరిసిపోయారు. ప్రస్తుతం ఆమె తన కెరీర్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్నారు. వివరాలలోకి వెళితే .. బ్యూటీ ఆయేషా ఖాన్.. ఫోటోషూట్ విశేషాలు: ఆయేషా ఖాన్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్న ఈ ఫోటోషూట్‌లో బ్లూ కలర్ శారీలో చాలా స్టైలిష్‌గా కనిపిస్తున్నారు. ఈ అవుట్‌ఫిట్‌లో ఆమె తన గ్లామర్‌ను సరికొత్తగా ఆవిష్కరించారు. ముఖ్యంగా ఆమె ఇచ్చిన కూల్ ఫోజులు, కళ్ళలో ఉన్న ఇంటెన్సిటీ నెటిజన్లను కట్టిపడేస్తున్నాయి. బ్లూ ఎప్పటికీ ఫ్యాషన్ అనేలా ఆమె ఈ లుక్‌ను క్యారీ చేశారు. ఈ ఫోటోలకు లక్షల్లో లైకులు మరియు వేలల్లో కామెంట్లు వస్తున్నాయి. ఫ్యాన్స్ ఆమెను గ్లామర్ క్వీన్ అని, బాలీవుడ్ క్వీన్ అని ఆకాశానికెత్తేస్తున్నారు. బిగ్ బాస్ నుంచి టాలీవుడ్ : ఆయేషా ఖాన్ కెరీర్ బిగ్ బాస్ 17తో ఒక్కసారిగా టర్న్ తీసుకుంది. ఆ షో ఇచ్చిన పాపులారిటీతో ఆమెకు టాలీవుడ్‌లో వరుస ఆఫర్లు క్యూ కట్టాయి. ఇప్పటికే శ్రీవిష్ణు నటించిన ఓం భీమ్ బుష్ లో ఒక ప్రత్యేక పాత్రలో మెరిసిన ఆమె, శర్వానంద్ మనమే సినిమాలో కూడా సందడి చేశారు. ఇక ఆమె దుల్కర్ సల్మాన్ లక్కీ భాస్కర్ సినిమాలో ఒక స్పెషల్ సాంగ్‌లో తన డాన్స్‌తో రచ్చ చేశారు. ఇప్పుడు గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ? బుచ్చిబాబు సనా కాంబినేషన్‌లో రాబోతున్న పెద్ది సినిమాలో కూడా ఆమెకు ఒక క్రేజీ ఆఫర్ వచ్చినట్లు తెలుస్తోంది. కేవలం సినిమాల్లోనే కాకుండా, సోషల్ మీడియాలో కూడా ఆయేషా యాక్టివ్‌గా ఉంటూ తన ఫాలోవర్లను అలరిస్తోంది. ఇక కెరీర్ పరంగా కూడా చాలా పక్కాగా పెద్ద సినిమాల్లో ఆమె కనిపించే అవకాశం ఉంది. గ్లామర్ మరియు నటన రెండూ ఉన్న ఈ బ్యూటీ, టాలీవుడ్‌లో లాంగ్ రన్ కొనసాగించడం ఖాయం అనిపిస్తోంది.

## జూనియర్ ఖుష్బూ అరంగేట్రం చేసేసింది!



ప్రతి రంగంలో వారసులు అరంగేట్రం చేస్తున్నారు. వారి ఫ్యామిలీ లెగసీని కొంత మంది కంటిన్యూ చేస్తూ ఆ స్థాయి స్టార్‌లుగా ఓ వెలుగు వెలుగుతున్నారు. కొంత మంది మాత్రం వారసత్వంతో ఎంట్రీ ఇచ్చినా ఇప్పటికీ స్టార్‌లుగా నిలబడలేకపోతున్నారు. స్టిల్ అందు కోసం యుద్ధం చేస్తూనే ఉన్నారు. సినిమా ఇండస్ట్రీలోనూ వారసులకు కొదవలేదు. క్రేజీ స్టార్‌లకు సంబంధించిన వారసులు అరంగేట్రం చేయడం స్టార్‌లుగా గుర్తింపుని తెచ్చుకోవడం తెలిసిందే. ఇప్పుడు మరో వారసురాలు తెరంగేట్రం చేస్తోంది. తమిళనాట భారీ క్రేజ్‌ని సొంతం చేసుకుని దేవతగా జేజేలందుకోవడమే కాకుండా గుడులు కూడా కట్టించుకునే స్థాయికి వెళ్లిన అలనాటి కథనాయిక ఖుష్బూ. ఆమె ఫ్యామిలీ నుంచి వారసురాలు ఎప్పుడెప్పుడు అరంగేట్రం చేస్తుందా? అని ఆమె అభిమానులు గత కొంత కాలంగా ఎదురు చూస్తున్నారు. ఎప్పటికప్పుడు వారసురాలి ఎంట్రీపై వార్తలు వస్తూనే ఉన్నాయి కానీ ఏదీ నిజం కాలేదు. అయితే తాజాగా అది నిజమవుతోంది. అలనాటి కథనాయిక ఖుష్బూ, డైరెక్టర్ సుందర్‌ల కుమార్తె అవంతిక సినీ పరిశ్రమలోకి అడుగుపెడుతోంది. అయితే అది తమిళ ఇండస్ట్రీ నుంచి కాదు.. మలయాళ ఇండస్ట్రీ నుంచి. అవంతికి హీరోయిన్‌గా అరంగేట్రం చేస్తున్న మలయాళ మూవీ 'ఆరంభం'. సుజేష్ అన్నీ ఏపెన్ దర్శకత్వం వహిస్తున్నాడు. కేరళలోని త్రిసూర్‌లో పూజా కార్యక్రమాలతో ఈ సినిమా ప్రారంభమైంది. మలయాళంలో రూపొందుతున్న ఈ మూవీ తమిళంలోనూ రిలీజ్ కానుంది. ఇతర కీలక పాత్రల్లో సరిత, అల్తాఫ్ సలీమ్, ఇంద్రన్స్, విజయరాఘవన్, కృష్ణ శంకర్, కళాభవన్ షాజోన్, సునీల్ సుగత, విజి వెంకటేష్, నోబీ మార్కోస్, రాజేష్ శర్మ, రమేష్ కొట్టాయం తదితరులు నటిస్తున్నారు. సరికొత్త ఫీచర్స్ తో ఏఎంబి సినిమాస్ తన కుమార్తె అరంగేట్రానికి సంబంధించిన ఆనంద క్షణాలని నటి ఖుష్బూ సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. అవంతికి ఇండస్ట్రీలోకి నటిగా ఎంట్రీ ఇస్తుందని చాలా రోజులుగా వార్తలు షికారు చేస్తున్నా కార్యరూపం దాల్చకపోవడంతో అంతా సైలెంట్ అయిపోయారు. అయితే తా జా గా తను ప్రత్యేకంగా ఓ ఫొటో షూట్‌లో పాల్గొనడంతో అవంతిక ఎంట్రీకి టైమ్ వచ్చేసిందని క్లారిటీ వచ్చేసింది. అనుకున్నట్టే తమిళ సినిమాతో కాకుండా మలయాళ మూవీతో పరిచయం అవుతుండటం గమనార్హం. గతంలో ఓ మీడియాతో మాట్లాడుతూ అవంతిక సినిమా రంగంలో తన ఎంట్రీకి సంబంధించిన ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. తనకు ఇండస్ట్రీలోకి రావాలనే ఉందని, అయితే తన హైట్ కారణంగా ఆలోచనలో పడ్డానని వెల్లడించింది. తాను 5:11 ఉంటానని, అది ఇబ్బందికలిగిస్తుందని భావించానని తెలిపింది. చాలా కాలంగా సినిమాల్లోకి రావాలని ఎదురుచూస్తున్నాను. ఒకప్పుడు లావుగా ఉన్నాను. కరోనా సమయంలో ఫిట్‌నెస్‌పై దృష్టిపెట్టాను. ఇండస్ట్రీలోకి రావాలనే తపనతో ఇలా నాజూగ్గా మారిపోయాను' అని అప్పట్లో వెల్లడించింది. అనుకున్నట్టే హీరోయిన్‌గా ఆరంభంతో ఆరంభించింది.

## హీట్ పెంచేస్తోన్న డింపుల్ హయతి!



ఒకవైపు సినిమా షూటింగ్లో బిజీగా ఉంటూనే.. మరొకవైపు అభిమానులను ఆకట్టుకోవడానికి గ్లామర్ విందు వడ్డిస్తున్నారు హీరోయిన్స్. అందులో భాగంగానే వెకేషన్ ఏదైనా సరే సందర్భం లేకపోయినా సరే ఇలా గ్లామర్ వలకబోస్తూ ఫాలోవర్స్ ను పెంచుకుంటున్నారు. మరి కొంతమంది తమ సినిమా ప్రమోషన్స్ కోసం ఇలా గ్లామర్ విందు వడ్డిస్తూ ఆ ఫోటోలను షేర్ చేస్తూ.. తమ సినిమాపై అంచనాలు పెంచుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే తమ అందాలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న హీరోయిన్స్ లో డింపుల్ హయతి కూడా ఒకరు. అందంతో , అభినయంతో ఆకట్టుకుంటూ స్వతంత్రంగా ఇండస్ట్రీలో ఒక స్థాయికి ఎదగాలని ప్రయత్నిస్తున్న ఈ సెలబ్రిటీ కిడ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. 2017లో గల్ఫ్ అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈమె యురేకా, అభినేత్రి 2 వంటి చిత్రాలలో నటించింది..కానీ 2019లో మెగా ప్రిన్స్ హీరో వరుణ్ తేజ్ హీరోగా వచ్చిన గద్దెలకొండ గణేష్ సినిమాలో "జర్ర జర్ర" అనే స్పెషల్ సాంగ్ చేసి ఊహించని పాపులారిటీ సొంతం చేసుకుంది. ఇక తర్వాత ఖిలాడి సినిమాతో మరో విజయాన్ని అందుకున్న ఈమె.. రామబాణం సినిమా చేసి రెండేళ్లు ఇండస్ట్రీకి దూరమయింది. మళ్లీ ఇటీవల రవితేజ హీరోగా వచ్చిన భర్త మహాశయులకు విజ్ఞప్తి అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సినిమా ప్రమోషన్స్ లో భాగంగానే తాను ఇండస్ట్రీ పెద్ద దివంగత దర్శక ధీరుడు దాసరి నారాయణరావు మనవరాలు అని , ప్రముఖ సీనియర్ నటీమణి ప్రభ తనకు నానమ్మ అవుతుందని చెప్పి అందరిని ఆశ్చర్యపరిచింది. పోతే ఇన్ని రోజులు ఈ విషయాన్ని బయట పెట్టని ఈమె సడన్గా ఈ సినిమా ప్రమోషన్స్ లో తన బ్యాగ్రౌండ్ గురించి చెప్పి అందరిని ఆశ్చర్యపరిచింది. హయతి తాజాగా మరోసారి అందాలు ఆరబోస్తూ హీట్ పెంచిందని చెప్పాలి .ఇక మహాశివరాత్రి అయిపోయిందో లేదో ఇంకా సమ్మర్ మొదలు కాలేదు రెచ్చగొడుతోంది. తాజాగా బ్లూ కలర్ చీర అవ్వడమే కాకుండా పలు రకాల కామెంట్లు చేస్తూ కామెంట్ బాక్స్ నింపేస్తున్నారు. సరికొత్త ఫీచర్స్ తో ఏఎంబి సినిమాస్ డింపుల్ హయతి తెలుగు, తమిళ్ , హిందీలో సినిమాలు చేయడమే కాకుండా అటు కన్నడ లో కూడా అరంగేట్రం చేసి తన డెబ్యూ సినిమాతో అక్కడ కూడా మంచి పేరు దక్కించుకుంది.

Printed and Published and Owned by **Dr. K. HARINATHA REDDY** on behalf of **Abhyudaya Publications, cell : 098483 34101, Printed at Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh and Published From **Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh, **Editor : Gudur Gopal**, **RNI No. APTEL/2012/46940**, e-mail: **sreechakratelugu@gmail.com.**